నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నిజామాబాద్-కామారెడ్డి
గురువారం | జూన్ 20, 2024 | www.navatelangana.com

కల్తీ విత్తనాలు, మందులు అమ్మితే కఠిన చర్యలు

టాస్క్‌ఫోర్స్ బృందం ఏడిఏ వీరస్వామి

నవతెలంగాణ-కామారెడ్డి



రికార్డులు, శాంపిళ్లు పరిశీలిస్తున్న అధికారులు

నకిలీ విత్తనాలు అమ్మితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని టాస్క్ ఫోర్స్ ఏడిఏ వీరస్వామి అన్నారు. బుధవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో గల ఫర్టిలైజర్ షాపులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్, ప్రిన్సిపల్ సర్టిఫికెట్లు, బిల్ బుక్కులను పరిశీలించారు. నకిలీ విత్తనాలు విక్రయించినా, రైతులకు బిల్లులు ఇవ్వకపోయినా దుకాణదారులపై కేసులు నమోదు చేస్తామన్నారు. నాణ్యమైన విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి ఏవోలు శ్రీనివాసరావు, హరీష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మటన్ మార్కెట్‌ను పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్

నవతెలంగాణ-కామారెడ్డి



మటన్ మార్కెట్ పరిశీలన

కామారెడ్డి పట్టణంలోని 45వ వార్డు పరిధిలో గల మటన్ మార్కెట్‌ను మున్సిపల్ చైర్పర్సన్ గడ్డం ఇందు ప్రియా వైస్ చైర్ పర్సన్, వనిత పరిశీలించారు. మార్కెట్‌లో ఉన్న షట్టర్లు సమస్య, స్లాబ్ పై వాటర్ రావడం వల్ల వ్యాపారస్తులకు ఇబ్బంది అవుతున్నందున త్వరలో సమస్య పరిష్కరిస్తానని తెలిపారు. అలాగే మెయిన్ గేట్, నీటి సమస్య, దుకాణాలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని దుకాణదారులకు సూచించారు. వారి వెంట మున్సిపల్ కమిషనర్ సుజాత, ఏఈ శంకర్, ఎస్సై రవీందర్, కామారెడ్డి పట్టణ కౌన్సిలర్లు, వార్డు కౌన్సిలర్, కోయల్కర్ కన్నయ్య, పాత శివ కృష్ణమూర్తి, రవీందర్ గౌడ్ చాట్ల వంశీ, మరియు కటికే కులస్తులు పాల్గొన్నారు,

నీట్ లీకేజీపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలి

- పేపర్ లీకేజీపై మోడీ బాధ్యత వహించి దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలి
- విద్యార్థి సంఘాల ఐక్యకార్యాచరణ కమిటీ డిమాండ్
- ఇరు జిల్లా కేంద్రాల్లో ర్యాలీ, నిరసన



నిజామాబాద్‌లో ర్యాలీగా వచ్చి కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు..



కామారెడ్డిలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ నిరసన చేపట్టి నినాదాలు చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ/కామారెడ్డి

'నీట్ లీకేజీ పై సుప్రీం కోర్టు జడ్జితో విచారణ జరిపించాలి.పేపర్ లీకేజీ పై నరేంద్ర మోడీ బాధ్యత వాయించి.దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలి. నీట్ విద్యార్థులకు న్యాయం చేయాలని' విద్యార్థి సంఘాల ఐక్యకార్యాచరణ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. దేశ వ్యాప్త పిలుపులో భాగంగా నిజామాబాద్ లో స్టూడెంట్ మార్చ్ నిర్వహించగా, కామారెడ్డిలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఎదుట నిరసన చేపట్టారు.

నిజామాబాద్ సిటీ : నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) బోర్డ్‌ను రద్దు చేసి 24 లక్షల మంది నీట్ విద్యార్థులకు న్యాయం చేయాలని మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నీట్ విద్యార్థులతో కలిసి విద్యార్థి సంఘాలు బుధవారం భారీ ర్యాలీ నిర్వహించాయి. విద్యార్థి సంఘాల ఐక్యకార్యాచరణ కమిటీ (ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, ఏబీపీఎస్‌యూ) ఆధ్వర్యంలో స్థానిక రాజీవ్ గాంధీ ఆడిటోరియం నుండి ఎన్టీఆర్ చౌరస్తా వరకు నీట్ విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎన్‌టీఆర్‌చౌరస్తా వద్ద కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అధీనం లో నడుస్తున్న ఎన్‌టీఏ బోర్డ్ ను వెంటనే రద్దు చేసి సిట్టింగ్ జడ్జి చే విచారణ జరిపించి 24 లక్షల మంది నీట్ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోడీ, కేంద్ర విద్య శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పెదవి విప్పి సమస్యను పరిష్కరించాలని అన్నారు. కేంద్రం రాష్ట్రాల స్వయంప్రతిపత్తిని కాపాడి నీట్ పరీక్షలను రాష్ట్రా ప్రభుత్వాలచే నిర్వహించాలని అన్నారు. అదే విధంగా కేంద్రం నిష్పక్షపా తంగా వ్యవహరించి రీ - పరీక్షా నూ నిర్వహించాలని కోరారు. తప్పు చేసిన కోచింగ్ సెంటర్ల పై శాశ్వతంగా నిషేధించి పేపర్ లీకేజీ లకు పాల్పడిన వారిని చట్ట పరంగా శిక్షించాలని అన్నారు. బాధిత నీట్ విద్యార్థులకు న్యాయం చేయకపోతే బీజేపీ పాలిత ఎంపీ ధర్మపురి అరవింద్ ఇంటి ముట్టడికి వెనకడం అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విఘ్నేష్, ఏఐఎస్ఎఫ్ జాతీయ కౌన్సిల్ మెంబర్ బానోత్ రఘురామ్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు నరేందర్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు వేణు రాజ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు అంజలి , పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి డాక్టర్ కార్క గణేశ్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గౌతమ్ ,జన్నారపు రాజేశ్వర్, ఏబీపీఎస్‌యూ జిల్లా కార్యదర్శి బోడ అనిల్ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు మహేష్, నాయకులు దీపిక, కుషాల్, గణేష్, సాయి తదితర నాయకులు పాల్గొన్నారు.

కామారెడ్డి : కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు నిరసన తెలిపారు. ఎంబీబీఎస్, ఇతర వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహిం చిన నీట్ - యూజీ ఎంట్రన్స్ లో అవకతవ కలు జరిగాయన్న ఆరోపణలకు సంబంధించి దేశ వ్యాప్తంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో నెలకొన్న అనుమానాలను ఉన్న దేశ ప్రధాని మోదీ స్పందించ కపోవడం సిగ్గుచేటని అన్నారు. బిహార్ లో రూ.30 లక్షలకు నీట్ ప్రశ్నపత్రాలు విక్రయించారని, ఈ వ్యవహారంలో అరెస్టులు జరుగుతున్నాయని వార్తలు వస్తున్నప్పటికీ కేంద్రం నరేంద్ర మోడీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమని నరేంద్ర మోడీ ప్రభుత్వం పై ఆగ్రహం వక్తం చేశారు.

నిట్ పరీక్ష ఫలితాలలో 67 మందికి మొదటి ర్యాంకు ఎలా సాధ్యమైందని? నీట్ పరీక్షలో గతంలో ఎప్పుడూ లేని విధంగా ఏకంగా 67 మందికి మొదటి ర్యాంకులు రావడం ఎన్నో అనుమానాలకు తావిస్తుందో స్పష్టంగా అర్థం అవుతున్నదన్నారు. ఒకే సెంటర్ నుంచి పరీక్ష రాసిన 8 మంది విద్యార్థులకు 720 మార్కులు రావడం చూస్తే బీజేపీ హయాంలో పేపర్ లీకేజీ వ్యవహారం ఏ స్థాయిలో జరిగిందో స్పష్టంగా కళ్ళకు కట్టినట్టుగా కనిపిస్తున్న పరిస్థితి ఉందన్నారు. ఫలితాలను 10 రోజులు ముందుకు జరిపి సరిగ్గా ఎన్నికల ఫలితాల రోజే ప్రకటించడం కూడా అనేక సందేహాలకు తావిచ్చిందన్నారు. ఇప్పటికైనా నీట్ పేపర్ లీకేజీ కి బాధ్యత వహిస్తూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (నీట్) చైర్మన్ ప్రదీప్ కుమార్ జోషి రాజీనామా చేయాలని అన్నారు. కేంద్రం ప్రభుత్వన్ని నీట్ నిర్వహణంలో వివాదాలు నిత్యం జరుగుతున్న నేపథ్యంలో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు, విద్యార్థులు కోరుతున్నట్లు నీట్ ఎగ్జాం ను రాష్ట్రాల పరిధిలోకి మార్చాలని కోచింగ్ సెంటర్లు పేరుతో, కన్సల్టెన్సీల పేరుతో పెపర్ లికేజీలు చేస్తున్న నీట్ కోచింగ్ సెంటర్ల అమనుమతులు రద్దు చేసి పేపర్ లీకేజీ కి పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి నిట్ రాసిన విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. విద్యార్థులకు, దేశ ప్రజలకు నరేంద్ర మోడీ ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో అన్ని విద్యార్థి సంఘాలని యువజన సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముదాం అరుణ్, పి డి ఎస్ యు రాష్ట్ర కోశాధికారి జి సురేష్, బి వి ఎం రాష్ట్ర కార్యదర్శి విటల్, ఎన్ ఎస్ యు ఐ జిల్లా కార్యదర్శి భరత్, ఎస్ఎఫ్ఐ నాయకులు మణికంఠ, పి డి ఎస్ యు జిల్లా కార్యదర్శి కృష్ణ, బి వి ఎం జిల్లా ఉపాధ్యక్షులు అర్బజ్, బి వై ఎం జిల్లా అధ్యక్షుడు బుల్లెట్ విద్యార్థులు పాల్గొన్నారు.



లేబర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేసిన అనంతరం మాట్లాడుతున్న రమేశ్‌బాబు

లిఫ్ట్ కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలి

- కనీస వేతనం అమలు చేయాలి : సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

లిఫ్ట్ ఇరిగేషన్ కార్మికులకు బకాయిలు వేతనాలు చెల్లించి కనీస వేతనాలను అమలు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ కార్యాలయంలో విస్తృత సమావేశం నిర్వహించి తమ సమస్యలను చర్చించుకున్నారు. అనంతరం లేబర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏ రమేష్ బాబు మాట్లాడుతూ.. గుత్ప, అలీసాగర్ లిఫ్ట్ ఇరిగేషన్‌లో గత అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులకు గతంలో కాంట్రాక్టర్ చేసుకున్న ఒప్పందం మేరకు రెండు నెలలకు ఒకసారి క్రమం తప్పకుండా వేతనాలు చెల్లించటానికి అంగీకరించి అదేవిధంగా అందరికీ ప్రావిడెంట్ ఫండ్‌ను జమ చేయడానికి ఒప్పుకున్నట్టు తెలిపారు. కానీ రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ వేతనాలను సక్రమంగా చెల్లించకుండా ప్రతిసారి ఏదో ఒక కారణం చెప్పి వాయిదాలు వేస్తూ మూడు నాలుగు నెలలకు ఒకసారి వేతనాలు ఇస్తున్నారని తెలిపారు. నెలంతా పనిచేసినప్పటికీ వేతనాలు సక్రమంగా రాకపోవడంతో పూట గడవడం కష్టంగా మారడంతో కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. కార్మికుల వేతనాలను సకాలంలో చెల్లించే విధంగా ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టాను సారంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు కనీస వేతనాలను, ఉద్యోగ భద్రత, పిఎఫ్, ఈఎస్ఐ లాంటి మౌలిక సదుపాయాలను అమలు జరపటంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తమ సమస్యల కోసం కార్మికులందరూ ఐక్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో లిఫ్ట్ ఇరిగేషన్ నాయకులు గణేష్, మైపాల్, కార్తీక్, అజయ్, సతీష్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

బస్సు పాస్‌ల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

బస్‌పాస్‌ల కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఆర్టీసీ ఆర్ఎం జానిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ఆరు డిపోల పరిధిలో బస్‌పాస్‌లు ఇవ్వనున్నామని, ముందుగా పాఠశాల, కళాశాల యాజమాన్యం వారు అడ్మినిస్ట్రేటివ్ చార్జెస్ చెల్లించి వారికి సంబంధించిన యూజర్ ఐడి, పాస్ వర్డ్ పొందాలని సూచించారు. బస్‌పాస్ తీసుకునే విద్యార్థులు www.tgsrtcpass.com వెబ్ సైట్ నందు బస్సు పాస్ వెబ్ పేజి నందు అన్ని వివరములు నింపి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మొబైల్ నెంబర్ తప్పని సరిగా ఇవ్వాలని, విద్యార్థులు దరఖాస్తు చేసిన బస్సు పాస్ ఫారం వారి పాఠశాల, కళాశాల యాజమ్మన్యం వారు అప్రూవల్ చేసుకోవాలని సూచించారు. వారు అప్రూవ్ చేసిన తర్వాతే విద్యార్థి మొబైల్ నెంబర్‌కు మెసేజ్ వస్తుందని తెలిపారు. ఈ మెసేజ్‌ను స్థానిక బస్టాండు నందు ఉన్న బస్సు పాస్ కౌంటర్ నందు చూపించి బస్సు పాస్ పొందాలని సూచించారు. విద్యార్థినిలు ఆధార్ కార్డు చూపితే సరిపోతుందని తెలిపారు.

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సమావేశాలు జయప్రదం చేయండి



మాట్లాడుతున్న పెద్దివెంకట్‌రాములు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఈ నెల 23, 24 తేదీలలో నిజామాబాద్‌లో జరిగే తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సమావేశాలను జయప్రదం చేయాలని సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఏశాల గంగాధర్ - పెద్ది వెంకట్రాములు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. నేడు వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులు, వ్యవసాయ కూలీలు, ఉపాధి హామీలో పనిచేస్తున్న కూలీలు, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై చర్చించడానికి ఈ నెల 23, 24 తేదీలలో నిజామాబాద్ లోని జనార్ధన్ గార్డెన్స్‌లో జరగనున్న రాష్ట్ర కమిటీ సమావేశాలు జయప్రదం చేయాలని జిల్లా ప్రజలందరికీ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 23వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పైన సెమినార్ ఉంటుందని, ఈ సెమినార్‌లో ఉపాధి హామీలో వస్తున్న సమస్యలు, పట్టణ ప్రాంతాలలో పట్టణ పేదలకు పట్టణ ఉపాధి హామీ కూడా తేవాలని డిమాండ్, రేషన్ కార్డులు, పింఛన్లు, ఇండ్లు ఇండ్ల స్థలాలు తదితర డిమాండ్స్‌తో ఈ సెమినార్‌లో చర్చ చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ సెమినార్‌కు ముఖ్యఅతిథిగా సంఘం జాతీయ కార్యదర్శి బి. వెంకట్ హాజరవుతున్నారని తెలిపారు. అలాగే చీఫ్ ప్యాట్రన్‌గా టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జి నాగయ్య, ఆర్ వెంకట్రాములు, సంఘం ఈ జిల్లా ఇన్చార్జి బుర్రి ప్రసాద్, మహిళా కూలీల రాష్ట్ర కన్వీనర్ బొప్పని పద్మ సంఘం అగ్ర నాయకులు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ సెమినార్‌ను జయప్రదం చేస్తే ప్రభుత్వం మీద ప్రభావం పడుతుందని కనుక అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కుంటలో పడి వ్యక్తి మృతి

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

ప్రమాదవశాత్తు కుంటలో జారిపడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మేత్రి సాయిలు (28) ఉదయం కాలకృత్యాలు తీర్చుకునేందుకు సమీపంలో ఉన్న మాల కుంటకు వెళ్లి వస్తుండగా కాలు జారీ నీటి కుంటలో పడ్డాడు. ఊబిలో చిక్కుకున్న సాయిలుకు ఊపిరాడక పోవడంతో అక్కడే మరణించాడు. మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాన్ని బయటకు తీశారు. మృతునికి ఇద్దరు కూతుర్లు ఉన్నారు. మృతుడి భార్య సవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై కోనారెడ్డి తెలిపారు.

పంట రుణాల అందించడంలో ఉదారంగా వ్యవహరించాలి

- బ్యాంకర్‌లకు సూచించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నవతెలంగాణ-కామారెడ్డి



బ్యాంకర్‌లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

రైతులకు పంట రుణాలను అందించడంలో ఉదారంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ బ్యాంకర్లకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో బ్యాంకర్లు, జిల్లా అధికారులతో రైతులకు రుణాల పంపిణీ, స్వయం సహాయక సంఘాల రుణాలు, రికవరీ, పిఎంఇజిపై, ఎస్సి, ఎస్టీ, సంక్షేమ శాఖల పథకాలకు సంబంధించి రుణ లక్ష్య పురోగతిపై బ్యాంకర్ల జిల్లా సమన్వయ కమిటీ, జిల్లా స్థాయి సమీక్షా కమిటీ సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పబ్లిక్, ప్రైవేట్ సెక్టార్ బ్యాంకర్లు వివిధ పథకాల క్రింద యూనిట్ల గ్రౌండింగ్ నిమిత్తం తమకు వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి గ్రౌండ్ అయ్యేలా చూడాలన్నారు. బ్యాంకుల వారీగా ప్రగతిని సమీక్షిస్తూ గత ఆర్థిక సంవత్సరంలో పంట రుణాలు, టర్మ్ లోన్స్, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు, విద్య, గృహ నిర్మాణం, తదితర రంగాలను రూ. 5,569 కోట్లు అందించాలని లక్ష్యం కాగా 78.60 శాతం సాధించడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఇకనైనా శాఖల అధికారాలు, బ్యాంకర్లు సమన్వయంతో పనిచేస్తూ వంద శాతం లక్ష్యాలను సాధించుటకు చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. అగ్రికల్చర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ క్రింద కోల్డ్ స్టోరేజీలు, గోదాముల నిర్మాణాలకు బ్యాంకులు రుణాలందిం స్తున్నందున పెద్ద రైతులు వాటి నిర్మాణానికి ముందుకు వచ్చేలా ప్రోత్సహించాలని జిల్లా వ్యవసాయ అధికారికి సూచించారు. స్వయం సహాయక సంఘాలకు బ్యాంక్ లింకేజి క్రింద రుణాలు అందించి వంద శాతం పైగా లక్ష్యాలు సాధించినట్లే ఈ ఏడాది లక్ష్యాలను అధిగమించాలన్నారు. 2016 -17 నుండి 2021-22 వరకు ఎస్సి, ఎస్టీ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ మంజూరు అయి పెండింగ్ లో ఉన్న యూనిట్లను కాలయాపన చేయకుండా త్వరితగతిన గ్రౌండింగ్ చేయాలన్నారు.

మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించు టకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నారిశక్తి కార్యక్రమాన్ని చేపట్టిందని, ఈ పథకం కింద ఎటువంటి ప్రాసెసింగ్ చార్జీలు లేకుండా 2 కోట్ల వరకు వివిధ వ్యాపారాలకు రుణాలు అందిస్తున్నదని మహిళలు ఈ చక్కటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా నిలదొక్కుకోవడంతో పాటు మరికొందరికి ఉపాధి అవకాశాలు కల్పించవచ్చన్నారు. అదేవిధంగా నారిశక్తి ఎస్టీపీ కింద ఎటువంటి సెక్యూరిటీ లేకుండా 2 నుండి 10 లక్షల వరకు ఋణం అందిస్తుందని ఆన్ లైన్‌లో డాక్యుమెంట్స్ సమర్పించడం ద్వారా లోన్ పొందవచ్చని అన్నారు.

ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్ రెహమాన్, ఎస్ బి ఐ రీజనల్ మేనేజర్ శ్రీనివాస్, కెనరా బ్యాంక్ డిఎమ్ తోరత్ , డిసిసిబి గానరల్ మేనేజర్ ఫణి సాయిరాం, యూనియన్ బ్యాంకు ఆర్ ఎం వికాస్, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, అధికా రులు చందర్, శ్రీధర్, లాలూ నాయక్, సింహ రావ్, భాగ్యలక్ష్మి, అంబాజీ, దయానంద్ పాల్గొన్నారు.

మత్స్యకారులకు, పాడి రైతులకు..

మత్స్య సహకార సంఘాల సభ్యులు మార్కెటింగ్ నిమిత్తం పెట్టుకున్న రుణ దరఖాస్తులను సిబిల్ స్కోర్ లేదని, తదితర కారణాలతో తిరస్కరించకుండా రుణాలు మంజూరు చేసి వారిని ఇతోధికంగా ఆదుకోవాలని బ్యాంకర్లను కోరారు. కిసాన్ క్రెడిట్ కార్డు పథకం కింద పాడిరైతులు, గొర్రెల పెంపకం దారులకు ఎలాంటి మార్టిగేజ్ లేకుండా రుణాలు మంజారు చేయాల న్నారు. పీఎంఈజీపీ క్రింద కేటాయించిన యూనిట్ల ను తిరస్కరించకుండా రుణాలు అందించి యూనిట్లు గ్రౌండ్ అయ్యేలా ఔత్సాహిక పారిశ్రామి కవేత్తలను ప్రోత్సహించాలన్నారు.

నాణ్యత పాటించాలి

- ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-నసూరుల్లాబాద్



నిర్మాణ పనులు పరిశీలిస్తున్న పోచారం

అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి నిర్ణీత సమయంలో పనులను పూర్తి చేయాలని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి సూచించార. బుధవారం నసూరుల్లాబాద్ మండలంలోని మైలారం గ్రామ శివారులోని శ్రీ కొచ్చేరి మైసమ్మ దేవాలయం వద్ద 1కోటి 60 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మిస్తున్న వసతి గృహం, 40 లక్షల రూపాయలతో వేస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ స్పీకర్ మాట్లాడుతూ బాన్సువాడ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో అధికారులు కాంట్రాక్టులను నాణ్యత ప్రమాణాలను పాటించాలని ఎవరైనా నిర్లక్ష్యం చేస్తే తగు చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. మైలారం గ్రామ శివారులో వెలసిన కొచ్చేరి మైసమ్మ ఆలయ నిర్మాణానికి జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమంలో ఎలాంటి అవినీతి అక్రమాలు జరగకుండా తగు జాగ్రత్తలు పాటించాలని నాణ్యత ప్రమాణాలు పాటించి అభివృద్ధి పనులు జరగాలని సూచించారు. ఇప్పటివరకు జరిగిన పనులను చూసి ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పాల్త్య విఠల్, జిల్లా కో ఆప్షన్ నెంబర్ మజీద్, సీనియర్ నాయకులు అంజిరెడ్డి, రాము, ప్రతాప్ సింగ్ పాల్గొన్నారు.

ఆశాలకు పరీక్ష విధానం రద్దు చేయాలి

- బీసీజీ సర్వే నిలిపివేసి, ఆశాల సమస్యలు పరిష్కరించండి
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్
- 24న కలెక్టరేట్ ధర్నాను జయప్రదం చేయాలని పిలుపు



మాట్లాడుతున్న నూర్జహాన్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఆశాలకు కొత్తగా ప్రవేశపెట్టిన పరీక్ష విధానం రద్దు చేయాలని, బిసిజి సర్వే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. సీఐటీయూ కార్యాలయంలో బుధవారం ప్రెస్‌మీట్ నిర్వహించి మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్తగా ప్రవేశపరీక్ష పెట్టాలని ప్రయత్నం చేస్తే ఆశ కార్యకర్తలు తిరగబడి ఆ ప్రయత్నాన్ని రద్దు చేశారని, నూతన కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ ఆశా కార్యకర్తలకు ప్రవేశ పరీక్ష పెట్టాలని ప్రయత్నిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'రాష్ట్రంలో ఎక్కడలేని విధంగా జిల్లాలో ప్రయోగాత్మకంగా బీసీజీ సర్వే పేరుతో కొత్త సంస్కరణ తీసుకువస్తున్నారు. ఉన్న పనులు చేయడానికి సమయం, శక్తి సరిపోవటం లేదు. కొత్త కొత్త సంస్కరణలు రాష్ట్ర హెల్త్ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఎగ్జామ్ విధానాన్ని, బీసీజీ సర్వే విధానాన్ని అమలు చేయాలని ఆశా కార్యకర్తలను ఇబ్బందులు గురి చేస్తున్నారు. ఆశా కార్యకర్తలు గత 19 సంవత్సరాలుగా గ్రామాల్లో బస్తీల్లో బీపీ, షుగర్, థైరాయిడ్ మాతా శిశు సంరక్షణ, కరోనా వంటి విపత్కర అనారోగ్య సమస్యలు ఏర్పడినప్పుడు ప్రజలకు ముందుండి పనిచేస్తున్నారు. నేషనల్ హెల్త్ ఆర్గనైజేషన్ వీరిని హెల్త్ గ్లోబల్ లీడర్ గా గుర్తించారు. అలాంటి స్కిల్ ఆశా కార్యకర్తలకు మళ్లీ నూతన ప్రవేశ పరీక్ష విధానాన్ని తీసుకురావడం చాలా శోచనీయం. ఈ ప్రవేశ పరీక్ష పెట్టడం వల్ల ఆశా కార్యకర్తల్లో భయాందోళనలు ప్రారంభం అయ్యాయి. ఉద్యోగులు తొలగించే విధంగా ఈ పద్ధతి తీసుకువచ్చారు. ఈ ఎగ్జామ్ వల్ల వీరికి ప్రమోషన్స్ గాని ఏఎన్ఎం వెయిటేజ్ గాని ఇచ్చే పరిస్థితి లేదు. అలాంటి విధానాన్ని వెంటనే రద్దు చేయాలి. రాష్ట్రంలో ఎక్కడలేని సర్వే బీసీజీ సర్వే (బాసిల్లస్ కాల్మెట్ గురిన్) జిల్లాలో చేయాలని రాష్ట్ర కమిషనర్ నుంచి సర్క్యులర్ వచ్చింది. ఈ బీసీజి సర్వేకు ఒక రూపాయి కూడా పారితోషికం ఇవ్వడం లేదు. అదనంగా జిరాక్స్ ఖర్చులు కూడా ఆశా కార్యకర్తలు భరించేలా చూస్తున్నారు. కాబట్టి వారితోషకం లేని బీసీజి సర్వేను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. పైనున్న సమస్యలను పరిష్కారం చేయకుంటే జూన్ 24వ తేదీనా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టనున్నట్టు తెలిపారు. కావున ఆశాలు ధర్నాకు పెద్దఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆశా యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు సుకన్య, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో చేర్పించాలి

- అధ్యాపకుల అడ్మిషన్ డ్రైవ్

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కనకమాలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం ఇంటర్మీడియట్ అడ్మిషన్ల కోసం అధ్యాపకులు అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించారు కళాశాలలో గల వివిధ వసతులను ఉచిత పాఠ్య పుస్తకాల పంపిణీ అన్ని రకాలైన వసతులు గురించి ప్రిన్సిపాల్ తెలిపారు కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ దేవరం, అధ్యాపకులు ఇర్ఫాన, సవిత, గంగారాం, స్వాతి, వెంకటేష్, మహేందర్ నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అడ్మిషన్ డ్రైవ్‌లో పాల్గొన్న ప్రిన్సిపాల్

మాజీ సర్పంచ్ గుండె పోటుతో మృతి

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని ఒడ్యాట్ పల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రామడొల్ల రాజేశ్వర్ గుండెపోటుతో బుధవారం మృతి చెందారు. ఈయన గతంలో మూడు పర్యాలుగా గ్రామానికి సర్పంచుగా ఎన్నికై ఎన్నో సేవలను అందించారు. ప్రస్తుతం ఆయన భార్య రామడొల్ల సుధ సర్పంచిగా ఉండి, సర్పంచి కల పరిమితి ముగిసింది. గ్రామ అభివృద్ధికి ఆయన సేవలు మరువలేనివని గ్రామస్థులు తెలిపారు. ఆయన అంత్యక్రియలు గురువారం స్వగ్రామంలో జరుగుతాయని గ్రామస్థులు తెలిపారు.



రాజేశ్వర్ (ఫైల్)

బాధిత కుటుంబాలను పరామర్శించిన జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు



బాధిత కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని పలు బాధిత కుటుంబాలను జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి బుధవారం పరామర్శించారు. తాళ్ళ రాంపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త బోదాస్ గంగాధర్ ప్రమాదవశాత్తు మరణించడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించి,ఆర్థిక సహాయం అందించి, బాధిత కుటుంబానికి అండగా ఉంటానని అన్నారు. ఇదే గ్రామానికి చెందిన చిట్యాల సాయమ్మ అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. నాగేంద్ర నగర్ గ్రామానికి చెందిన ఎస్.కె.జలీల్ మరణించడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు సోమదేవరెడ్డి, జడ్పిటీసీ గుల్లే రాజేశ్వర్,బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ ఆడేం గంగాప్రసాద్, జిల్లా జనరల్ సెక్రెటరీ రవి రెడ్డి,డీసీసీ డెలిగేట్ గడ్డం జీవన్ రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రేండ్ల రమేష్, మండల మైనార్టీ అధ్యక్షులు మునీరొద్దీన్, నాయకులు గడ్డం లింగారెడ్డి, తుపాకుల శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ సిలికాసెల్ ఎనీమియా దినోత్సవం



సిలికాసెల్ ఎనీమియా దినోత్సవంలో పాల్గొన్న పలువురు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల, కళాశాలలో జరిగిన ప్రపంచ సిలికాసెల్ ఎనీమియా దినోత్సవం పురస్కరించుకొని ఆరోగ్య విస్తరణ అధికారి వైశంకర్ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు కనీసం హిమోగ్లోబిన్ 12 గ్రాముల నుండి 14 గ్రాముల వరకు కలిగి ఉండాలని అన్నారు. విద్యార్థులు పౌష్టిక ఆహారాన్ని అనగా తాజా ఆకుకూరలు, కరివేపాకు, మునగ ఆకు, మునగ కాడలు, బెల్లం, పల్లీపట్టీలు, పాలు, గుడ్లు, ఆహారంగా తీసుకోవాలని తెలిపారు. రక్తహీనత గల విద్యార్థులు తొందరగా అలసిపోతారని, గుండెదడ అధికంగా ఉంటుందని వివరించారు. పాలిపోయిన ముఖమును కలిగి ఉంటారని, ముఖ్యంగా కౌమార బాలికలు ఎనిమియా కలిగి ఉండరాదని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకులు చందన, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి, జెడ్పిటిసి సుమనా రవి రెడ్డి, ఎంపీటీసీ చింతల దాస్, రాంపూర్ సహకార సొసైటీ చైర్మన్ తారాచంద్ నాయక్, స్థానిక వైద్యాధికారి డాక్టర్ సంతోష్ కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆచరణాత్మక ప్రజాపంథా సిద్ధాంత రూపకర్త డీవీ కృష్ణ

- భారత విప్లవోద్యమ నేత



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-సిరికొండ

సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకులు పి.రామకృష్ణ ఆచరణాత్మక ప్రజాపంథా సిద్ధాంత రూపకర్త, భారత విప్లవోద్యమ నేత కామ్రేడ్ డీవీ కృష్ణ విప్లవకారులకే ఆదర్శం అని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకులు పి.రామకృష్ణ అన్నారు. ఉద్యోగాన్ని వదిలి విప్లవోద్యమ నిర్మాణంకు కృషి చేసిన ఆదర్శప్రాయుడన్నారు. సమకాలీన పరిస్థితులకు అనగుణంగా విప్లవ పార్టీలు తమను సైదాంతికంగా తీర్చి దిద్దుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని చెప్పిన నేత అని అన్నారు. అతివాదం మితవాదం రెండు విప్లవోద్యమానికి నష్టకరమని, ప్రజాపంథాలో విప్లవోద్యమ నిర్మాణంకు పునుకోవడమే సరియైన మార్గం అని నిరూపించిన గొప్ప విప్లవ సైద్యాంధికర్త అని ఆయన కొనియాడారు. మార్క్సిస్ట్ మహోపాధ్యాయులు చెప్పినట్టు ప్రజలే చరిత్ర నిర్మాతలు అని, ప్రజలు లేని విప్లవాలు విజయవంతం కాలేవని ప్రపంచ చరిత్ర తెలుపుతుందని సిద్ధాంతాన్ని నవీనపరిచిన గొప్ప విప్లవ పితామహుడు అని ఆయన కొనియాడారు. జూన్26న డీవీ కృష్ణ రెండవ వర్ధంతి సందర్భంగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలో స్మారక స్థూపవిష్కరణతో పాటు రెండవ వర్ధంతిని ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. స్థూపాన్ని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) అలిండియా కార్యదర్శి కామ్రేడ్:ప్రదీప్ సింగ్ ఠాగూర్ చేయనున్నారని, రాష్ట్ర కార్యదర్శి రంగారావు, రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు, తదితరులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి రమేష్, సిపిఐ(ఎం ఎల్.) ఆర్మూర్ డివిజన్ కమిటీ సభ్యులు ఆర్. దామోదర్, మండల కమిటీ సభ్యులు లింబాద్రి, రమేష్, కిషోర్, అనిస్, కిషోర్,ఆసిస్, రాములు, ప్రభాకర్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

19ఏళ్ల వయసు లోపు పిల్లలకు

నులిపురుగుల నివారణ మాత్రలు వేయాలి

- పాఠశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీలు
- సిబ్బందికి అవగాహన సదస్సులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్ ఆధ్వర్యంలో ఇందల్‌వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ర్యాలీ, అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణ అధికారి వై శంకర్ మాట్లాడుతూ.. 19 ఏళ్ల వయస్సు గల పిల్లలందరికీ మాత్రలు పంపిణీ చేయాలని ప్రతి అంగన్వాడీ కేంద్రం, ప్రతి పాఠశాల, ప్రతి జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలలో కూడా విద్యార్థులు 19 సంవత్సరాలు వయస్సు కలిగిన విద్యార్థులందరికీ ఒక మాత్ర వేయాలని ఆదేశించారు. ఇందల్‌వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 32 వేల మంది ఒక సంవత్సరం నుండి 19 ఏళ్ల వయస్సు గల పిల్లలు ఉన్నారని, ఈ మాత్రలు ఏడాది వయస్సు నుండి రెండేళ్ల వయస్సు గల పిల్లలకు సగం మాత్రం అనగా 200 ఎంజి ఇవ్వాలని, రెండేళ్ల నుండి 19 ఏళ్ల వయస్సు గల పిల్లలందరికీ ఒక మాత్ర అనగా 400 ఎంజి ఇవ్వాలని ఆదేశించారు. పిల్లలందరికీ కడుపునిండా భోజనం తిన్న తర్వాత ఈ మాత్రలు వేయాలని సూచించారు. ప్రతి పాఠశాలలో సామాన్య శాస్త్ర ఉపాధ్యాయుడు, అంగన్వాడీ టీచర్ బాధ్యతగా వహించి ప్రతి పిల్లలకు అల్బెండిడలు మాత్రమే వేయాలని ఆదేశించారు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇందల్ వాయికి సమాచారం ఇవ్వాలని తెలిపారు. చిన్నపిల్లలు మట్టిలో ఆడుకుంటూ ఆ చేతులను నోట్లో పెట్టుకుని ఉన్నట్లయితే ఆ పిల్లలు ఆరు బయట మల విసర్జన చేసిన ప్రాంతాలలో ఆడుకున్నప్పుడు వారికి ఈ నులి పురుగులు జీర్ణాశయంలో ప్రవేశించి పిల్లలు మట్టి తినడానికి అలవాటు పెడతారని వివరించారు. ఈ పిల్లలు నీరసంగా ఉండడం వీరికి రక్తం తక్కువగా ఉండడం ఎనీమియా ఎక్కువగా ఉంటుందని, కడుపు ఉబ్బడం ఇలాంటి లక్షణాలు కలిగి ఉంటాయని తెలిపారు. వీటన్నిటికీ పరిష్కారం అల్బండజోల్ మాత్రలే అని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు అక్బర్ అలీ, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆర్మూర్: ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



కోటగిరిలో...

కోటగిరి: నులి పురుగుల నివారణపై ఆరోగ్య విస్తీర్ణాధికారి గోవర్ధన్ ఆధ్వర్యంలో బుధవారం మండలకేంద్రంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా తహసిల్దార్ సునీత పాల్గొని ఆమె మాట్లాడుతూ.. నులిపురుగుల నివారణ మన అందరి బాధ్యతని, అంగన్వాడి సెంటర్లో, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు తప్పనిసరిగా మాత్రలను అందించాలని అన్నారు. అనంతరం ఎత్తొండ గ్రామంలో పరిశుభ్రతపై పలు సూచనలు అందజేశారు. అనంతరం మండల అభివృద్ధి కార్యాలయంలో ఎంపీడీవో మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో అంగన్వాడి ఆశా వర్కర్లకు డి వార్మింగ్‌పై పలు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో ఏపీవో మారుతి, సూపర్వైజర్లు జ్యోతి, సాయి కుమారి, శ్రీదేవి, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు

ఆర్మూర్: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో పాఠశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గోవింద్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెచ్ఈఓ రవి మాట్లాడుతూ ఆల్బెండజోల్ మాత్రలు ఒకటి నుంచి 19 సంవత్సరాలు ఉన్న ప్రతి ఒక్కరికి అందే విధంగా చూడాలని అన్నారు. ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలల్లోనూ అంగన్వాడి కేంద్రాలలోనూ ఆరోగ్య ఉప కేంద్రంలోనూ అందుబాటులో ఉన్నాయని తెలిపారు ఆల్బెండజోల్ మాత్రలను సంవత్సరానికి రెండు సార్లు వేసుకోవాలన్నారు. దీనివల్ల కడుపులో ఉన్న నట్టలను చంపి వేస్తుందని తద్వారా రక్తహీనతకు గురికాకుండా చూస్తుందన్నారు గురువారం రోజు మాత్రలు తీసుకొని వారికి 27న అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు జక్కుల మోహన్ శ్యామల ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: మండలంలోని చౌట్ పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలతో పాటు కళాశాలలో గురువారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకొని ఆల్బెండజోల్ మాత్రలు వేసేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ సుప్రియ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక సంవత్సరం నుండి 19 సంవత్సరాల లోపు విద్యార్థులందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయనున్నట్లు తెలిపారు. దీని ద్వారా పిల్లల్లో రక్తహీనత తగ్గుతుందని, తద్వారా పిల్లలు చాలా చురుకుగా, ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ప్రతి విద్యార్థి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. అంగన్వాడి కేంద్రాలు, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఈ మాత్రలను చప్పరించి మింగాలని సూచించారు. గురువారం పాఠశాలలకు హాజరు కాని విద్యార్థులకు ఈ నెల 27న ఆల్బెండజోల్ మాత్రలు వేస్తామని తెలిపారు.

విద్యార్థులకు నులిపురుగు మాత్రలు వేయించాలని ర్యాలీ

జక్రాన్‌పల్లి : నులిపురుగు మాత్రణ వలన రక్తహీనత తగ్గుతుందని మండల వైద్యాధికారి రవీందర్ బుధవారం అన్నారు. జాతీయ నులిపురుగుల దినోత్సవం పురస్కరించుకొని మండల వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ప్రధాన వీధుల గుండా వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. నులిపురుగు నివారణ మాత్రలు ఒక సంవత్సరం నుంచి 19 సంవత్సరాల వయసుగల విద్యార్థులకు గురువారం పాఠశాలల్లో అందించడం జరుగుతుంది అని తెలిపారు. తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించి విద్యార్థులు మరుగుదొడ్డికి వెళ్ళినప్పుడు చేతులను సబ్బుతో శుభ్రం చేయించుకోవాలని తెలపాలన్నారు. చేతి వేళ్లకు ఉన్న గోర్లను ఎప్పటికీ ఎప్పుడు శుభ్రం చేస్తూ ఉండాలని తెలిపారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటిస్తే జీవితంలో ఎటువంటి రోగాలు రావని, రక్తహీనత కు లోను కారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి అఖిల్, హెల్త్ సూపర్వైజర్లు, స్టాఫ్ నర్స్ శాంత, ల్యాబ్ టెక్నీషియన్ ప్రవీణ్ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



డిచ్‌పల్లిలో...



జక్రాన్‌పల్లిలో...

బీమాతోనే ఆర్థిక భరోసా

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ఆపత్కాలంలో బీమాతోనే కుటుంబానికి ఆర్థిక భరోసా లభిస్తుందని జగిత్యాల జిల్లా మెట్ పల్లి ఎస్బిఐ బ్రాంచ్ మేనేజర్ తోట రాంబాబు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా పని చేస్తున్న లబ్ధిదారు రామచందర్‌కు రూ.2లక్షల75వేల ఇన్సూరెన్స్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని నర్సాపూర్ తండాకు చెందిన గుగులోత్ స్రవంతి పేరుపై ఆమె భర్త కమ్మర్‌పల్లి పోలీస్ స్టేషన్లో హోంగార్డు గుగులోత్ రామచందర్ 2023లో మెట్‌పల్లి ఎస్బిఐ లైఫ్ లో రూ.5వేల సరల్ స్వధాన్ ప్లస్ ఇన్సూరెన్స్ పాలసీని తీసుకున్నారు. ఇటీవల అనారోగ్యంతో స్రవంతి మృతి చెందారు. ఆమె పేరుపై ఉన్న ఇన్సూరెన్స్ పాలసీ కింద రూ.2లక్షల75వేల చెక్కు మంజూరైనట్లు ఆయన తెలిపారు. చెక్కును పాలసీదారు భర్త, హోంగార్డు రామచందర్‌కు అందించినట్లు వివరించారు. అకాల మరణం చెందిన స్రవంతికి కేవలం రూ.5వేలకే రూ.2లక్షల75వేల ఇన్సూరెన్స్ కవరేజి ఇచ్చినట్లు తెలిపారు. పేద మధ్యతరగతి కుటుంబాల వారికి సరల్ స్వధాన్ ప్లస్ ఇన్సూరెన్స్ అద్భుతమైన పాలసీ అన్నారు. ఈ పాలసీని 18 సంవత్సరాల నుండి 55 సంవత్సరాల వరకు ఉన్న ఎవరైనా తీసుకోవచ్చు అని సూచించారు. ఆర్థికంగా అండగా నిలిచిన ఎస్బిఐ లైఫ్ వారికి రామచందర్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ ఏజెన్సీ మేనేజర్ డాకురి హరీష్, లైఫ్ మిత్రలు మురళి, తిరుపతి, మధు, అరుణ్, ఊట్నూరి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న మేనేజర్

అంతర్జాతీయ యోగా దినోత్సవం విజయవంతం చేయండి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ లో ఈనెల 21న ఉదయం ఏడు గంటలకు కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ బిల్డింగ్‌లో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని జరిగే యోగ కార్యక్రమాన్ని విద్యార్థులు, టీచింగ్ నాన్ టీచింగ్ సిబ్బంది విజయవంతం చేయాలని ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ రవీందర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్



షాపును సందర్శించిన ఎంపీడీవో

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ప్రభుత్వం అందించిన పథకాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా జీవితంలో ఆర్థికంగా నిలదొక్కుకోవాలని ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆయన మండలంలోని బషీరాబాద్ గ్రామంలో బీసీ బంధు పథకంలో భాగంగా రూ. లక్ష ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసుకొని నిర్వహిస్తున్న పలు షాపులను ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన బీసీ బంధు లబ్దిదారులతో మాట్లాడారు. వ్యాపారం ఎలా సాగుతుంది, బీసీ బంధు పథకంలో అందించిన ఆర్థిక సహాయంతో నిర్వహిస్తున్న వ్యాపారాలు ఏంటి తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆర్థికంగా వెనుకబడిన కులాలను గుర్తించి ప్రభుత్వం ఈ బీసీ బందు పథకాన్ని ప్రవేశపెట్టిందని, ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయాన్ని సక్రమంగా వినియోగించుకోవడం ద్వారా ఆర్థికంగా నిలదొక్కుకోవాలని సూచించారు. ప్రభుత్వ సహాయాన్ని దుర్వినియోగం చేస్తే నష్టపోతారని తెలిపారు. పలువురు లబ్ధిదారులు నిర్వహిస్తున్న వ్యాపారాలను చూసి వారిని అభినందించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

ముల్లంగిలో క్రాప్‌బుకింగ్ వెరిఫికేషన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని ముల్లంగిలో బుధవారం సిబి ఈ క్రాప్ బుకింగ్ వెరిఫికేషన్‌ను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజిద్ హుస్సేన్ పాల్గొని క్షేత్ర స్థాయిలో బుధవారం పర్యటించారు. వ్యవసాయ శాఖ విస్తరణ అధికారులు క్షేత్రస్థాయిలో ఏ రైతు ఏ సర్వే నెంబర్లో ఏ పంట వ్యవసాయ శాఖ క్రాప్ బుకింగ్ పంటలను నమోదు చేయాలో ఆ సర్వే నెంబర్లను బుధవారం పర్యటించారు. 15 సర్వే నెంబర్లలో పంటల వివరాలను పరిశీలించారు. వ్యవసాయ శాఖ విస్తరణ అధికారులు వానకాలం 2024 గాను క్షేత్రస్థాయిలో పర్యటించి పంటలు నమోదు కార్యక్రమం చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజిద్ హుస్సేన్ ఆదేశించారు. ఆయన వెంట మండల వ్యవసాయ శాఖ అధికారి రాంబాబు, విస్తరణ అధికారులు భావన రూపేష్ రైతులు తదితరులు ఉన్నారు.



పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

ఆరోగ్య శ్రీ ఉద్యోగుల సమస్య పరిష్కరించండి



షబ్బీర్ అలీకి వినతిపత్రాన్ని అందజేసిన ఆరోగ్య శ్రీ ఉద్యోగులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ ప్రభుత్వ సలహా దారులు, షబ్బీర్ అలిని నిజామాబాద్ ఆరోగ్య శ్రీ ఉద్యోగులు బుధవారం కలిసి సమస్యను పరిష్కరించాలని కోరారు. 16 సంవత్సరాలుగా లిఫ్ట్ క్యాడర్‌పై కంప్యూటర్ వర్క్ వివిధ క్యాడర్ వర్క్ చేస్తున్నామని తెలిపారు. అర్హతతో కుడిన క్యాడరే డిపిఓ క్యాడర్‌గా మార్పు చెయ్యాలని కోరారు. షబ్బీర్ అలీ స్పందించి ఆరోగ్యశ్రీ పథకం కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. ఈ సమస్యని తొందరలో పరిష్కరిస్తానని మాట ఇస్తున్నాను అని చెప్పారని తెలిపారు.

బొల్లారంలో పాఠశాల పరిశీలన

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని బొల్లారం గ్రామంలో గల జెడ్‌పిహెచ్‌ఎస్ పాఠశాలను జడ్పిటిసి సభ్యుడు ఉమ్మన్నగారి మనోహర్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించినట్టు ఆయన పేర్కొన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలిం చారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని ఆయన అన్నారు. అదేవిధంగా బదిలీపై వెళ్తున్న వ్యాయామ ఉపాధ్యాయుడు నరేష్‌రెడ్డిని ఆయన సన్మానించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి సంతోష్ ఉన్నారు.



పప్పును పరిశీలిస్తున్న జడ్పిటిసి

సైబర్ నేరాల కట్టడిపై అవగాహన

నవతెలంగాణ-గాంధారి

గాంధారి పోలీస్ స్టేషన్ పరిధిలో బస్‌స్టాండ్ నందు కళాబృందం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఇందులో భాగంగా వచ్చి పోయే ప్రయాణికులకు తగు జాగ్రత్తలు తెలుపుతూ సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. సైబర్ నేరాల పట్ల టోల్ ఫ్రీ నెంబర్ 1930 గురించి భాదితులు పై నెంబర్‌కి ఫిర్యాదులు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమానికి కళాబృందం సభ్యులు, పీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పలువురు

భగీరథ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

నవతెలంగాణ-పిట్లం

మిషన్ భగీరథ ఇంటింటి నల్లాల సర్వే పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో కమలాకర్ అన్నారు. బుధవారం మండల కేంద్ర గ్రామ పంచాయతీ పరిధిలోని గద్దగుండు తాండలో నిర్వహిస్తున్న మిషన్ భగీరథ నల్లాల సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటింటా నల్లాలు కలిగిన ఇండ్లు, నల్లాలు లేని ఇండ్లను గుర్తించి సత్వరమే తాగునీటికి ఇబ్బంది లేకుండా వారికి నల్లాలు కేటాయించాలని ఆయన సూచించారు. వాటితోపాటు ప్రస్తుత నల్లాల బాగోగులు ఎలా ఉన్నాయో వాటిని పరిశీలించి పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ యాదగిరి, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారులు

మిషన్ భగీరథకు తూట్లు

- తూతూ మంత్రంగా మిషన్ భగీరథ పనులు
- ఎక్కడ చూసినా అందని నీటి సరఫరా

నవతెలంగాణ-మద్నూర్

గత కెసిఆర్ ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథ మంచినీటి పథకానికి మండలంలో తూట్లు పడ్డాయి. మిషన్ భగీరథ మంచినీటి పథకం వందల కోట్ల రూపాయలతో చేపట్టిన పనులు తూతూ మాత్రంగానే చేపట్టి ఇంటింటికి మంచినీరు అందించకుండానే నీటి పైపులు మురికి కాలువలకే పరిమితమయ్యాయి. ఈ పథకం ప్రారంభమై ఏళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు మిషన్ భగీరథ మంచినీళ్లు చుక్క నీరు అందడం లేదు. మండలంలోని చిన్న ఎక్లారా గ్రామంలో బిగించిన మిషన్ భగీరథ ఇంటింటి కులాయిల పరిస్థితి నిదర్శనంగా చెప్పుకోవచ్చు.. ఈ మిషన్ భగీరథ పథకం ఇప్పటివరకు చుక్క నీరు కూడా కుళాయిల ద్వారా అందించిన దాఖలాలు లేవు. ఏ గ్రామంలో చూసినా బిగించిన కులాయిలే నీటి సరఫరాను చూపించగలవు అప్పటి ప్రభుత్వం ఈ పథకం ద్వారా కాంట్రాక్టర్ల జేబులు నింపింది. కుళాయిలు బిగించినట్టు గ్రామాల్లో పైపులైనులు ఏర్పాటు చేసినట్టు ప్రతి ఇంటి నుంచి ఇంటి యజమాని యొక్క ఆధార్‌కార్డు నెంబర్ సేకరించి కుళాయిల బిగింపు పూర్తి చేసినట్టు బిల్లుల కోసం గ్రామపంచాయతీల నుండి తీర్మానాలు పొంది లక్షల రూపాయలు మిషన్ భగీరథ పథకం ద్వారా జేబులు నింపుకున్నట్టు ప్రజల ఆరోపిస్తున్నారు.

ప్రస్తుతం అధికారంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగుతుంది. ఈ ప్రభుత్వం మిషన్ భగీరథ పథకంపై పట్టు బిగించినట్లు తెలుస్తోంది. ఈ పథకం ద్వారా మంచినీళ్ల ఇంటింటికి అందుతున్నాయా లేదా సర్వేలు చేపడుతున్నట్టు తెలుస్తోంది. ఈ పథకం ద్వారా లక్షలాది రూపాయలు మోసపోయినట్లేనని ప్రజల్లో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వ పాలనలో కొనసాగిన గ్రామపంచాయతీ పాలకవర్గాలు కూడా పూర్తిగా నిర్లక్ష్య వైఖరి అవలంబించినట్లు కాంట్రాక్టర్లతో కుమ్మక్కై పనులు పూర్తి కాకపోయినా మిషన్ భగీరథ మంచినీటి సరఫరా జరగకపోయినా పనులు ఒకే అన్నట్లు తీర్మానాలు అందజేస్తూ కమిషన్లు పొందినట్లు మండల ప్రజలు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఇలాంటి పథకం పట్ల ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం సమగ్రమైన విచారణ చేపట్టి అక్రమాలపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



మురుగుకాలువపై న ఉండి వేసిన భగీరథ పైపులు

భగీరథ నీళ్లు సక్రమంగా వస్తున్నాయా..?

- కొనసాగుతున్న ఇంటింటి సర్వే
- పరిశీలించిన అధికారులు

నవతెలంగాణ-జుక్కల్

మిషన్ భగీరథ నల్లా నీరు సక్రమంగా వస్తున్నాయా? వీధిలో అందరికి మిషన్ భగీరథ నల్లాలు ఉన్నాయా.. ఇంకా ఎంతమందికి నల్లా కనెక్షన్‌లు లేవు అన్న విషయాలను వీధిలో ఇంటింటికి తిరిగి కాలనీ వాసులకు క్షేత్రస్థాయిలో సర్వే కొనసాగుతుంది. కాగా బుధవారం పలు మండలాల్లో ఎంపీడీవోలు పరిశీలించారు.

జుక్కల్ : మండలంలోని ముప్పై గ్రామ పంచాయతీలలో నల్లాల సర్వే పకడ్బందీగా నిర్వహించాలని ఎంపిడివో శ్రీనివాస్ ఆర్డబ్ల్యుఎస్, జీపీ సెక్రటిలకు ఆదేశించారు. ఈ సందర్భంగా కుమ్మరి వాడలో మిషన్ భగీరథ నల్లా నీరు సక్రమంగా వస్తున్నాయా? వీధిలో అందరికి మిషన్ భగీరథ నల్లాలు ఉన్నాయా.. ఇంకా ఎంతమందికి నల్లా కనెక్షన్‌లు లేవు అన్న విషయాలను వీధిలో ఇంటింటికి తిరిగి కాలనీ వాసులకు క్షేత్రస్థాయిలో సర్వేను బుదువారం పరిశీలించారు. గ్రామాలలో ఉన్న వారికి ఇంటింటికి తాగునీరు అందించాలని, నల్లా కనెక్షన్ లేని వారికి కొత్త కనెక్షన్ ఇవ్వాలని జీపీ కార్యదర్శులకు ఎంపీడీవో ఆదేశించారు. ఆయనతో పాటు స్థానిక అధికారులు ఉన్నారు.



సర్వే నిర్వహిస్తున్న అధికారులు

ఐఐఎంలో గిరిజన విద్యార్థికి చోటు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని మెల్లకుంట తండాకు చెందిన రమావత్ వీణ తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ సైనిక శిక్షణ కళాశాలలో విద్యను అభ్యసిస్తూ దేశంలోనే అత్యున్నతమైన ఐఐఎం సంబల్పూర్‌లో ఎంబీఏ సీటు సాధించింది. విద్యార్థిని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పాండురంగ శర్మ అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థిని రమావత్ వీణ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నాకు ప్రభుత్వ పాఠశాలలో సీటు ఇవ్వడం వల్లనే నేను ఈ స్థాయికి ఎదిగానని ఆమె గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఆమె ధన్యవాదాలు తెలిపారు.



రమావత్ వీణ

ఆరోగ్యమే మహాభాగ్యం

- రాష్ట్రస్థాయి ప్రత్యేక అధికారి డాక్టర్ సత్యనారాయణ



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి డాక్టర్ సత్యనారాయణ

నవతెలంగాణ-గాంధారి

నేషనల్ సెకండ్ సేల్ అనీమియా ఎలిమినేషన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయిలో మండల కేంద్రంలోని ఈఎంఆర్ఎస్ పాఠశాలలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రస్థాయి నుంచి ప్రత్యేక అధికారిగా డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ.. ఆరోగ్యమే మహాభాగ్యం అని విద్యార్థులు సరైన ఆహారం తీసుకోవాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి డిటిడిఓ అంబాజీ, స్థానిక ఎంపిటిసి సభ్యులు తూర్పు రాజులు, ఎస్టీ హాస్టల్ వార్డెన్ నవీన్, పాఠశాల ప్రిన్సిపాల్. డాక్టర్‌లు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా ప్రవీణ్‌కుమార్

నవతెలంగాణ-సదాశివనగర్

మండలం నూతన డిప్యూటీ తహసీల్దార్‌గా యస్. ప్రవీణ్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. డిప్యూటీ తహసీల్దార్ ఖాజ షరీఫ్ కలెక్టర్ కార్యాలయానికి బదిలీ అయినట్లు తెలిపారు. యస్. ప్రవీణ్‌కుమార్ కామారెడ్డి కలెక్టర్ కార్యాలయం నుంచి సదాశివనగర్ తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు.



డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్

ఏకరూప దుస్తులను త్వరగా అందించాలి

- ఎంపీపీ నారెడ్డి దశరథ్‌రెడ్డి



కుట్టు మిషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ నారెడ్డి దశరథ్‌రెడ్డి

నవతెలంగాణ-రామరెడ్డి

ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఏకరూప దుస్తులను ఐకేపీ ఆధ్వర్యంలో కుట్టిస్తున్న సందర్భంగా బుధవారం ఐకెపి కార్యాలయంలో స్థానిక ఎంపీపీ నా రెడ్డి దశరథ్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలు ప్రారంభం అయినందున విద్యార్థులకు నాణ్యతతో త్వరగా ఏకరూప దుస్తులు అందేలా కృషి చేయాలని ఐకెపి ఏపిఎం ప్రసన్న కుమార్‌కు సూచించారు. కార్యక్రమంలో ఏపిఓ ధర్మారెడ్డి, సీసీ ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.



బూజు పట్టిన విత్తనాలు

రికార్డును పరిశీలిస్తున్న అధికారులు

నకిలీ విత్తనాలపై రైతుల ఫిర్యాదు

- దుకాణాలు తనిఖీ చేసిన వ్యవసాయ అధికారులు

నవతెలంగాణ-బిచ్కుంద

మండల కేంద్రానికి చెందిన రైతు దీప్ చంద్ గ్రీన్ గోల్డ్ 33 రకం సోయాబీన్ 25 కిలోల బ్యాగు 3,050 రూపాయల చొప్పున 12 బ్యాగులు ఈ నెల 8వ తేదీన ఆగ్రో రైతు సేవ కేంద్రంలో కొనుగోలు చేశారు. అందులోని ఐదు బ్యాగులలోని విత్తనాలు నల్లగా మారి బూజు పట్టడం గమనించిన రైతు మంగళవారం రాత్రి దుకాణదారుని దగ్గరకు తీసుకువచ్చి కల్తీ విత్తనాలు విక్రయించారని నిలదీశారు. వ్యవసాయ అధికారులు అందుబాటులో లేకపోవడంతో బిచ్కుంద పోలీసులు విత్తనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బుధవారం ఇంచార్జి ఏడిఏ లక్ష్మీపసన్న, ఏఓ రాజలింగం పోలీస్ స్టేషన్‌కి వెళ్లి అక్కడ ఉన్న సోయా బ్యాగులలోని విత్తనాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. సోయా విత్తనాలకు తేమ తగలడంతో నల్లగా మారి బూజు పట్టినట్టు రైతులకు రైతులకు వివరించారు. అనంతరం సోయా విత్తనాలు విక్రయించిన దుకాణంలో తనిఖీలు చేయగా ఆ లాట్‌కు సంబంధించిన విత్తనాల బ్యాగులు విక్రయాలు జరిగిపోయాయని దుకాణంలో ఐదు సోయా బ్యాగులు మాత్రమే మిగిలి ఉండగా వాటిని సీజ్ చేశామని వ్యవసాయ అధికారులు తెలిపారు. స్టాక్ రిజిస్టర్, విత్తనాలకు సంబంధించిన బిల్లులు, ఇన్వాయిస్ పరిశీలించారు. రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంబంధించిన కంపెనీ ద్వారా రైతులకు విత్తనాలు ఇప్పించనున్నట్టు ఏడీఏ లక్ష్మీ ప్రసన్న తెలిపారు.

నూతన కలెక్టర్‌కు సన్మానం

నవతెలంగాణ-రామారెడ్డి

కామారెడ్డి జిల్లా నూతన కలెక్టర్‌గా పదవి బాధ్యతలు చేపట్టిన ఆశిష్ సంగ్వాన్‌ను జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి, పుష్పగుచ్చాలు అందజేశారు. ఈ సందర్భంగా మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. రామారెడ్డి మండలంలో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరగా, కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్టు ఆయన తెలిపారు.



కలెక్టర్‌ను సన్మానించిన నా రెడ్డి మోహన్‌రెడ్డి

నులిపురుగు మాత్రలు కచ్చితంగా వేయించాలి

- వైద్యాధికారి హిమబిందు

నవతెలంగాణ-లింగంపేట్

19 ఏండ్లలోపు ప్రతి ఒక్కరికి నులిపురుగు నివారణ మాత్రులు వేయించాలని మండల వైద్యాధికారిని హిమబిందు అన్నారు. బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గురువారం మండలంలోని ఆయా గ్రామాల్లో గల ప్రాథమిక పాఠశాలలో అంగన్వాడీ కేంద్రాలు 19 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి నులిపురుగు మాత్రలు వేయించడం జరుగుతుందన్నారు. మండలంలో 12,600 మంది విద్యార్థిని, విద్యార్థులకు నలిపురుగు మాత్రలు వేయనున్నట్టు తెలిపారు. ఉదయము 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రామాల వారీగా 19 సంవత్సరాల పిల్లలకు వేస్తామన్నారు. పిల్లల తల్లిదండ్రులు కచ్చితంగా తమ పిల్లలకు మాత్రలు వేయించాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.



వైద్యాధికారిని హిమబిందు

రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-విలేకరులు

నాగిరెడ్డిపేట్: మండల కేంద్రంలో గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్ కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ వాసురెడ్డి కోఆప్షన్ సభ్యుడు షాహిద్ పాష, లక్ష్మణ్, ఇమామ్, దివిటీ కిష్టయ్య, శ్రీరామ్ గౌడ్, నరసింహారెడ్డి, ఫారూఖ్ సాబ్, సాయిగౌడ్, సంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్ : మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో దేశ ప్రధానిగా రాహుల్ గాంధీ కావడం ఖాయమని తెలిపారు.

బిచ్కుంద : కాంగ్రెస్ పార్టీ యువజన రాష్ట్ర కార్యదర్శి విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో కలిసి కేక్‌కట్ చేసి రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేసి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షులు ధర్పల్ గంగాధర్, అజయ్ పటేల్, వెంకటేష్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

నందిపేట్ : రాహుల్ గాంధీ భవిష్యత్తు ప్రధాని అని కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్చార్జి పొద్దుటూరు వినయ్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇంచార్జి ప్రొద్దుటూరి వినయ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సుఖీభవ హాస్పిటల్‌లో రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ వారు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఆయన రక్త దానం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మంద మహిపాల్ నాయకులు పెంట ఇంద్రుడు, బైండ్ల ప్రశాంత్ సుఖీభవ హాస్పిటల్ మేనేజ్మెంట్ నరేందర్, గాదరి గోపి, తదితరులు, పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి : పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కురుమ సాయిబాబా ఆధ్వర్యంలో బుధవారం రాహుల్ గాంధీ జన్మ దిన వేడుకలను పురస్కరించుకొని కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రభుత్వం ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పిటిసి ఉషాగౌడ్, మాజీ జెడ్పిటిసి గయాజుద్దీన్, చిన్న లక్ష్మణ్, ఎన్ఎస్‌యుఐ నాయకులు శ్రీనివాస్, కుడుముల సత్యనారాయణ, గోపికృష్ణ, తిరుపతి పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్ : మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, మోహన్ బస్వరాజ్, సంజీవ్, కాంత రెడ్డి, విట్టల్, రషీద్, శ్రీనివాస్, నాగరాజు పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

లింగంపేట్ : లింగంపేట్ మండల కేంద్రంలోని గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బుర్ర నారాగౌడ్ కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం కోసం పేద ప్రజల కోసం రాహుల్ గాంధీ భారత్ జూడయాత్ర చేసి అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో లింగంపేట్ పట్టణ అధ్యక్షుడు ప్రసాద్ గౌడ్, మండల యూత్ అధ్యక్షుడు రాజు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ నగేష్ పాల్గొన్నారు.



నాగిరెడ్డిపేట్: కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు



ఎల్లారెడ్డిలో...



పెద్దకొడప్‌గల్‌లో...



నందిపేట్‌లో రక్తదానం చేస్తున్న వినయ్‌రెడ్డి

రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా మారిన స్తంభం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండల పరిధిలోని కళ్యాణి గ్రామ చౌరస్తా నడి మధ్యలో గాంధీ విగ్రహం సమీపంలో ప్రధాన రోడ్డు పక్కన ఐరన్ పోల్ (ఇనుప స్తంభం) ప్రమాదకరంగా మారింది. వర్షాకాలం రాగానే జంకుతున్నారు. ఈ ఐరన్ పోల్ వలన ప్రమాదం పొంచి ఉందని గ్రామ మాజీ సర్పంచ్ రఘువీర్ గౌడ్ విద్యుత్ శాఖ వారికి లికితపూర్వకంగా ఫిర్యాదు చేసి నెలలు గడిచినా స్పందించడం లేదని దీనిపై ఆయన వివరణ ఇస్తూ విద్యుత్ శాఖ వారిపై అసహనం వ్యక్తం చేశారు. రాబోయే వర్షాకాలంలో ఈ ఐరన్ పోల్ వలన ఎటువంటి అవాంఛనీయ ప్రమాద ఘటన జరగకముందే స్పందించి ముందు జాగ్రత్తగా దీని తొలగించాలని సంబంధిత అధికారులకు గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.


రోడ్డు మధ్యలో ఉన్న ఇనుప స్తంభం

ఎంపీపీని సన్మానించిన ఉద్యోగులు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

ఎంపీపీగా నూతనంగా ఎన్నికైన టేకులపల్లి వినీత దుర్గారెడ్డిని బుధవారం మండల పరిషత్ కార్యాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జడ్పిటిసి మనోహర్‌రెడ్డి, ఎంపీడీవో పార్వన్న పాల్గొన్నారు.


ఎంపీపీని సన్మానిస్తున్న ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు

ఇసుక అక్రమ రవాణా ఆపాలి

- కలెక్టర్‌కు వినతి


వినతిపత్రం అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

నవతెలంగాణ-భీంగల్

మండలంలోని బెజ్జోరా గ్రామ పరిసరాలలో గల కప్పల వాగు నుండి అక్రమంగా తరలిస్తున్న ఇసుక రవాణాను అరికట్టాలని కోరుతూ ఎంపీపీ ఆర్మూర్ మహేష్, జెడ్పిటిసి చౌటుపల్లి రవి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దొనకంటి నరసయ్య ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కు, ఇన్చార్జి సిపి కి బుధవారం వినతి పత్రం అందజేశారు. బెజ్జోరా కప్పల వాగు నుండి ఎలాంటి అనుమతులు లేకుండా రెండు ఇసుక పాయింట్లు ఏర్పాటు చేసి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని తెలిపారు. ఈ విషయమై తాసిల్దార్, ఎస్సై, సీఐ, ఆర్డీవోకు వినతి పత్రం అందించిన ఇలాంటి చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. కనుక అక్రమ రవాణాను అరికట్టి తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ను కోరారు. వీరి వెంట జడ్పీ కో ఆప్షన్ మెంబర్ మోహిజ్ ఉన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో బంగారు భవిష్యత్



సలహా మండలి సభ్యులు రాజేశ్వర్‌కు సన్మానం

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని రెంజర్ల గ్రామంలో కొత్తగా నియామకం అయిన ఆయిల్ పామ్ సలహా మండలి సభ్యులు సొంగళి రాజేశ్వర్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించిందని జిల్లా ఉద్యాన అధికారి రోహిత్ తెలిపారు.ఈ సందర్భంగా ఉద్యాన శాఖ ఆయిల్ పామ్ సాగుపైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం అనంతరం సొంగళి రాజేశ్వర్ ను ఘనంగా సన్మానించారు. ఆయిల్ ఫామ్ సాగుతో రైతులు లాభాల బాటలో సాగుతూ బంగారు భవిష్యత్తును సాదించుకుంటారని అన్నారు. ఆయిల్ పామ్ సాగు చాలా సులభతరంగా ఉంటుందనితెలిపారు. కేవలం ఒక ఎకరం వరి సాగుకు అవసరం అయ్యే నీళ్ళతో 4 ఎకరాలు సాగు చేయవచ్చని అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆకుల రాజన్న, జిల్లా ఉద్యాన అధికారి, పట్టుపరిశ్రమ మధుసూదన్, ప్రేనిక్యూ ఆయిల్ పామ్ కంపెనీ డీజీమ్ మల్లేశ్వర్ రావు, ఉద్యాన అధికారి రోహిత్, ఏరియా మేనేజర్ రోహిత్, రైతులు తదితరులు పాల్గొన్నారు..


22న సంఘం శరణం గచ్చామి నాటక ప్రదర్శన

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

ఆధునిక భారతదేశ జాతిపిత, ప్రపంచ మేధావి, భారతరత్న బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జీవిత చరిత్ర ను ఈ నెల 22 న సంఘం శరణం గచ్చామి నాటక ప్రదర్శనను నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో సాయత్రం 6 గంటలకు ప్రదర్శన ఉంటుందని పి ఎస్ ఎం సెక్రటరీ సిర్ప లింగం తెలిపారు. బుధవారం పలు సంఘాల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. హైదరాబాద్ కళాకారులచే, అభ్యుదయ ఆర్ట్స్ జగ్గ రాజు నేతత్వంలో సంఘం శరణం గచ్చామి నాటకాన్ని రూపొందించారని తెలిపారు. జిల్లాలోని కళాకారులు, నాటక అభిమానులు తరలి రావాలని కోరారు. ఈ నాటకాన్ని ఇతర జిల్లాల్లో ఇది వరకే ప్రదర్శన ఇవ్వటం జరిగిందని, నిజామాబాద్ లో అభిమానుల కోరిక మేరకు ఏర్పాటు చేయనున్నారని అన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు అధ్యక్షులు ఎల్లయ్య, పట్టణ మాల మహానాడు అధ్యక్షులు ఎడ్ల ధన్ రాజ్, కార్యదర్శి బట్టి గంగాధర్, బౌద్ధ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు అశోక్ భగవాన్, ఎస్ బాలయ్య, స్వామి, నారాయణ, వినయ్ కుమార్, చక్రి, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కళాశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి కృషి చేయాలి

- జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్


మాట్లాడుతున్న డీఐఈవో

నవతెలంగాణ -బోధన్

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి అధ్యాపకులు కషి చేయాలని ఇంటర్ విద్యాధికారి రవికుమార్ అన్నారు. బుధవారం ఆయన బోధన్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి అడ్మిషన్ల ప్రక్రియపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన కళాశాలలో ఉన్న సౌకర్యాలు, సమస్యలపై అధ్యాపకులు చర్చించారు. గతంలో కంటే ఈ సంవత్సరం విద్యార్థుల సంఖ్యను పెంచేలా కషి చేయాలని సూచించారు. కళాశాలలో ఏవైనా సమస్యలుంటే తన దష్టికి తీసుకురావాలని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో ప్రిన్సిపల్ నికత్ కౌసర్, అధ్యాపకులు పాల్గొన్నారు .

జీపీ కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలి

- 26న చలోకలెక్టరేట్ : సీఐటీయూ


మాట్లాడుతున్న జంగం గంగాధర్

నవతెలంగాణ-వర్ని

గ్రామపంచాయతీ కార్మికుల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 26న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని చేపట్టనున్నామని జిల్లాలోని గ్రామపంచాయతీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి జంగం గంగాధర్ కార్మికులకు పిలుపుని చ్చారు. బుధవారం మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ఎనిమిది నెలలుగా బకాయి వేతనాలు చెల్లించకపోవడంతో గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికులు అర్ధాకలితో అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలపై పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, కమిషనర్‌తో చర్చలు చేసినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదన్నారు. గత్యంతరం లేక జూన్ 26న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. ఈ సమావేశంలో యూనియన్ మండల కన్వీనర్ రాజు, కో - కన్వీనర్ మారయ్య, నాయకులు సాయిలు, గోపాల్, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని సిబ్బంది

- సమయం దాటినా హాజరుకాని ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది
- ప్రజా పాలన దరఖాస్తుదారుల నిరీక్షణ

నవతెలంగాణ-భీంగల్

విధుల్లో నిర్లక్ష్యం చేయరాదని ఓ పక్క జిల్లా స్థాయి అధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నాను. ఇవేమీ పట్టనట్టు మండల స్థాయి అధికారులు ప్రవర్తిస్తున్నారు. ఇందుకు ఉదాహరణ మండల పరిషత్ కార్యాలయం లో పనిచేసే సిబ్బంది సమయ పాలన. ప్రభుత్వ సమయం 10.30 వరకు సిబ్బంది కార్యాలయానికి చేరుకోవాలని కానీ సమయానికి హాజరు కాలా లేకపోతున్నారు. బుధవారం 10:40 అయినను కార్యాలయంలో ఏ ఒక్కరు హాజరు కాకుండా కాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. ప్రస్తుతం ప్రజాపాలన దరఖాస్తులకు ఎంపీడీవో కార్యాలయంలో హెల్ప్ లైన్ ఏర్పాటు చేయడంతో దరఖాస్తుదారులు ఇక్కడ సిబ్బంది కోసం నిరీక్షిస్తున్నారు. వద్దులైతే నిరీక్షించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.


అధికారులు లేక ఖాళీగ ఉన్న కుర్చీలు..
దరఖాస్తు దారుల పడిగాపులు

పోచారం సార్.. ప్రతిపక్షంలో ఉండండి

- తిరుమల తిరుపతి దైవ సాక్షిగా చెప్పారు మర్చిపోయారా
- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సురేశ్‌బాబా


మాట్లాడుతున్న సురేశ్ బాబా

నవతెలంగాణ-వర్ని

తెలంగాణ రాష్ట్ర మాజీ స్పీకర్, బాన్సువాడ నియోజకవర్గం ఏమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి మీరు ప్రతిపక్షంలో ఒక 5 ఏండ్లు ఉండండి.. పదవులు లేకపోతే మీకు నిద్ర రాదా.. అని వర్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సురేష్ బాబా ఘాటుగా విమర్శించారు. బుధవారం మండల కేంద్రంలో పలు గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల సమక్షంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసిమాట్లాడారు. రెండు రోజులుగా పలు పత్రికల్లో పోచారం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ లో చేరుతారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మంతనాలు జరుగుతున్నాయని అన్నారు. ఆరోపణలపై వార్తలు వస్తే ఎందుకు స్పందించటం లేదని ప్రశ్నించారు. మీరు ఒక ఐదేళ్ల ప్రతిపక్షంలో ఉండి చూడండి.. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో చేరి పదవుల కోసం పాకులాడటం తగదు అని హితవుపలికారు. ప్రతి గ్రామ కాంగ్రెస్ కార్యకర్త మీరు కాంగ్రెస్ పార్టీలోకి రావడానికి వ్యతిరేకిస్తున్నారని ఆయన అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మా కాంగ్రెస్ కార్యకర్తలను, నాయకులకు పెట్టిన కష్టాలు, కేసులు ఇంక ఉన్నాయని అన్నారు. మీరు కాంగ్రెస్ పార్టీ లోకి వస్తే మేము మీతో ఉండబోమని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గంగప్రసాద్, నారాయణ, నెమని విరాజ్, మైనారిటీ అధ్యక్షులు, పలు గ్రామాల పార్టీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

రేపు సాదారణ సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-సదాశివనగర్

రేపు సాదారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న ట్లు ఎం.పి.డి.ఓ సంతోష్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి వచ్చే అధికారులు పూర్తి సమాచారంతో రావాలని సూచించారు. సమావేశం కు ఎం.పి.టి.సిలు మండలం లోని ప్రాథమిక సహ కార సంఘాల అధ్యక్షులు శుక్రవారం ఉదయం 10.30 లకు గైని అనుసూయ అధ్యక్షతన సమావేశం ఉంటుందని తెలిపారు.

కలెక్టర్‌కు శుభాకాంక్షలు వెల్లువ

నవతెలంగాణ-కామారెడ్డి/దోమకొండ

కామారెడ్డి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆశీష్ సంగ్వాన్‌కు బుధవారం పలువురు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు.

కామారెడ్డి : కామారెడ్డి జిల్లా నూతన కలెక్టర్‌గా వచ్చిన ఆశిష్ సంగ్వాన్‌ను, కామారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందు ప్రియా చంద్రశేఖర్ రెడ్డి, వైస్ చైర్ పర్సన్ ఊర్దొండ వనిత రవి, పుష్ప గుచ్ఛం, అభినందలు తెలిపారు, కామారెడ్డి మున్సిపల్‌లో జరుగుతున్న, అభివృద్ధి, ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నాము అని దీనికి మీరు మా కార్యక్రమాలను చూసి సహకరించాలని, తాగునీటి సమస్య, డ్రైనేజ్ సమస్య, రోడ్ల నిర్మాణం గురించి చర్చించారు. కలెక్టర్ కలిసిన వారిలో కామారెడ్డి పట్టణ కౌన్సిలర్, పాత శివ కృష్ణమూర్తి, చాట్ల వంశీ తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ : కలెక్టర్‌ను దోమకొండ జడ్పీటీసీ తీర్మల్ గౌడ్ మర్యాద పూర్వకంగా కలిసి నోటు పుస్తకాలు అందజేసి శాలువా తో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

బుక్స్, యూనిఫాంలు అమ్ముతున్న స్కూళ్లను సీజ్ చేయాలి

- తెలంగాణ విద్యార్థి పరిషత్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ విద్యార్థి పరిషత్ జిల్లా అధ్యక్షులు బొబ్బిలి కళ్యాణ్ రామ్ ఆధ్వర్యం జిల్లా విద్యాశాఖ అధికారి కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బొబ్బిలి కళ్యాణ్ మాట్లాడుతూ పెరిగిన ఫీజులు దానికి తోడు (యూనిఫామ్, బెల్ట్, టై, సాక్స్) అని అధిక ధరలు పెట్టి, ఇక్కడే కొనుగోలు చేయాలి అని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. నోట్ బుక్స్ కూడా అధిక ధరలకి అమ్ముతున్నా రన్నారు. కొన్ని పాఠశాలలు బుక్ స్టోర్ వారికి కమిషన్ మాట్లాడుకొని విద్యార్థుల తల్లిదండ్రులకి అక్కడే కొనుగులు చేయాలని చెబుతున్నారని తెలిపారు. మరి కొన్ని పాఠశాలలు, పాఠశాలకి కొద్ది దూరంలో షెటర్ తీసుకొని అమ్మడం జరుగుతుందన్నారు. వెంటనే అన్ని పాఠశాలని సందర్శించి నిబంధనలు పాటించని స్కూల్స్ పై కేసులు నమోదు చేసి పాఠశాలని సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. అమ్ముతున్నట్టు మా దష్టి కి వస్తే ఆ పాఠశాల సీజ్ అయ్యే వరకు ఉద్యమం చేస్తామని అన్నారు. పుస్తకాలను సీజ్ చేసి పెద విద్యార్థులకు పంచుతామని ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యానికి హెచ్చరించారు కార్యక్రమంలో వినయ్, మహేష్, సుజిత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో జిల్లా, మండల సమాఖ్యలకు

అవార్డులు రావడం సంతోషకరం

- తక్కువ సమయంలో 70శాతం యూనిఫాంలు అందజేత
- క్యాంటీన్ల నిర్వహణ, ఈవెంట్ మేనేజ్మెంట్,
- సోలార్ విద్యుత్ ప్లాంట్లు మహిళలకు అప్పగింత
- డీఆర్‌డిఏ, డిఆర్‌డీఓ పిడి సాయగౌడ్


పలువురు అధికారులకు సన్మానం

నవతెలంగాణ-డిచ్‌పలి

బ్యాంకు లింకేజీ నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేసుకున్నందుకు గాను 3 రాష్ట్రస్థాయిలో అవార్డులు, డిచ్ పల్లి మండల సమాఖ్యకు అవార్డు రావడం సంతోషదాయకమని డిఆర్‌డిఎ, డిఆర్‌డిఓ పిడి సాయగౌడ్ అన్నారు. స్కూల్ యూనిఫాంలకు సంబందించి సిబ్బంది అందరి సహకారం, వలన తక్కువ సమయంలో 70శాతం వరకు యూనిఫాంలు అందజేశామని, ఇప్పుడు రెండవ - సెట్ యూనిఫాం కుట్టడానికి, అంగన్వాడీ పిల్లలకు యూనిఫాం కుట్టడానికి అవసరమైన బట్టలు, కటింగ్ మిషన్లు, తగిన సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఇందూరు జిల్లా మహిళా సహకార సమాఖ్య 81 వ కార్యవర్గ సమావేశం బుధవారం మండల కేంద్రంలోని ట్రైజం సెంటర్లో జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షులు రాధ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పిడి సాయగౌడ్, అడిషనల్ పిడి రవీందర్ హాజరై మాట్లాడారు. గత మూడేళ్లుగా బ్యాంకులు లింకేజ్ విభాగంలో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలవడంలో ప్రధాన పాత్ర పోషించిన సిబ్బంది అందర్నీ అభినందించారు. లోకోస్ సంబంధించిన అప్రూవల్‌లో రాష్ట్రంలో 60 శాతం ఉండగా 90 శాతం అప్రూవల్‌లో నిజామాబాద్ జిల్లా అగ్రస్థానంలో ఉందని వివరించారు. జిల్లా వ్యాప్తంగా ఫీవర్ ఆడిట్ 15 రోజుల్లో సిబ్బంది సహకారంతో 100శాతం పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో 46 కేంద్రాల్లో వరి ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని, ఇప్పటివరకు 70శాతం వరకు ఈ స్కూల్ యూనిఫామ్ లను అందజేయడం జరిగిందని తెలిపారు. రానున్న రోజుల్లో మహిళలను ఆర్థికంగా మరింత బలోపేతం చేయడానికి క్యాంటీన్ల నిర్వహణ ఈవెంట్ మేనేజ్మెంట్ సోలార్ విద్యుత్ ప్లాంట్ల వంటి వివిధ కార్యక్రమాలను మహిళలకు అప్పగించబోతున్నామని వివరించారు. రాష్ట్రస్థాయిలో నిజామాబాద్ డిచ్పల్లి మండల సమక్షకు అవార్డు వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకుని నిజామాబాద్ జిల్లా సెట్ జేఏసీ ఆధ్వర్యంలో టీడీ అడిషనల్ పిడి డిపిఎం బ్యాంకింగ్ మండల సమైక్య ఏపిఎం, ఇతర అధికారులకు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిపిఎంఐబి శ్రీనివాస్, డిపిఎం ఫైనాన్స్ సంధ్యారాణి, డిపిఎం బ్యాంకు లింకేజీ నీలిమ, డిపిఎం మ్యాన్షన్ సాయిలు మారుతి సరోజిని శ్రీనిధి జిల్లా మేనేజర్ వరలక్ష్మి ఏపిఎం సిబిఆర్డిటర్లు కోశాధికారి లక్ష్మి జిల్లా సమక్ష కార్యవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు.

ఆహార కల్తీపై అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కన్స్యూమర్ కాన్ఫిడెన్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో న్యూఢిల్లీ లో జరుగుతున్న వినియోగదారుల జాతీయ సమావేశాలకు జాతీయ చైర్మన్ డా. అనంత్ శర్మ అధ్యక్షతన, తెలంగాణా రాష్ట్రం నుండి పలువురు తరలివెళ్లారు. కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ చీఫ్ సెక్రటరి నిధి ఖరే, అడిషనల్ సెక్రటరీ అనుపమ్ మిశ్రా, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ప్రమోషనల్ ఆఫీసర్ రాహుల్ రాజ్‌లు అన్ని రాష్ట్రాల ప్రతినిధులతో సమావేశమయ్యారు. బంగారు ఆభరణాలపై హెచ్‌యుఐడీ నెంబర్‌ను వ్యాపారులు నమోదు చేయకపోవడం, అదనంగా వీఏ ఛార్జీలు వసూలు, దక్షిణాది రాష్ట్రాల్లో ఫోర్టిఫైడ్ రైస్ ప్రాధాన్యత, ప్రభుత్వ వెబ్సైట్ ద్వారా వినియోగదారుల చైతన్యం, ప్రభుత్వ యూనివర్సిటీలో కన్స్యూమర్ స్టడీ సెంటర్ల ఏర్పాటు, తెలంగాణా రాష్ట్రంలో తీవ్ర ప్రభావం ఉన్న ఆహార కల్తీ, నకిలీ మందుల సంఘటనలు వెలుగులోకి రావడంపై అధికారులు చర్చించారు. ఆహార కల్తీపై అప్రమత్తంగా ఉండాలని చర్చించారు. రియల్ ఎస్టేట్ రంగంలో మహారాష్ట్ర తరువాత తెలంగాణ హైదరాబాద్ రెండవ స్థానంలో ఉందన్నారు. కేంద్ర వినియోగదారుల హక్కుల పరిరక్షణ అథారిటీ సీసీపీఏ, నేషనల్ కన్స్యూమర్ హెల్ప్ లైన్ 1915 పై విస్తత ప్రచారం చేయాలని నిధి ఖరే వినియోగదారుల ప్రతినిధులను కోరారు. కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచర్ల సుదర్శన్, క్యాట్కో చైర్మన్ శంకర్ లాల్ చౌరాసియా, నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు పెందోట అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి సందు ప్రవీణ్ పాల్గొన్నారు.

కంకర డస్ట్ కుప్పలను ఢీకొన్న బైక్

- రోడ్డు పనులు చేపడుతున్న కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ప్రమాదాల బారిన వాహనదారులు
- వాహనదారుల ఆగ్రహం


గాయపడ్డ వ్యక్తి

నవతెలంగాణ-బోధన్

సాలూర మండల కేంద్రం వద్ద చేపడుతున్న బైపాస్ రోడ్డు నిర్మాణ పనులలో భాగంగా కాంట్రాక్టర్ నిర్లక్ష్యం మూలంగా ఇద్దరు ద్విచక్ర వాహనదారులు కంకర డస్ట్ కుప్పలను ఢీకొని గాయపడ్డారు. రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నందున కాంట్రాక్టర్ రోడ్డుపై ఎలాంటి ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేయలేదు. దాంతో మంగళవారం రాత్రి బోధన్ వైపు నుండి సాలూర వైపు వెళ్తున్న రమేష్ అనే వాహనదారుడు రాత్రి వేళ కంకర డస్ట్ కుప్పలు కనపడకపోవడంతో వాటికి ఢీకొని కిందపడ్డాడు. దాంతో తలకు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదం జరిగిన మరో అరగంటలోనే తగ్గెల్లి గ్రామానికి చెందిన మరో వ్యక్తి అక్కడే ప్రమాదానికి గురయ్యి తలకు తీవ్ర గాయాలయి చెవిలో నుండి రక్తం వచ్చినట్టు స్థానికులు తెలిపారు. స్థానికులు క్షతగాత్రులను బోధన్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రోడ్డు పనులపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని బాధితులు కోరారు.

ఐఎఫ్‌టీయూ రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయండి



వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

బద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులో జూన్ 23న జరిగే జరిగే ఐఎఫ్‌టీయూ రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శివరాజు కార్మికులకు పిలుపు ఇచ్చారు. జనరల్ కౌన్సిల్‌కు సంబంధించిన గోడ ప్రతులు ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పుట్ట వరదయ్యతో కలిసి నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నాగరంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శివరాజు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని విమర్శించారు. పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను రద్దు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 44 కార్మిక చట్టాలను 4లేబర్ కోడ్ లుగా మార్చి కార్మికులకు తీరని అన్యాయం చేశారని ఆరోపించారు. కార్పొరేటికరణ, ప్రైవేటీకరణ కు వ్యతిరేకంగా కార్మికులు పోరాడాలని అన్నారు. మున్సిపాలిటీ, ట్రైల్స్, బీడీ, మోటార్, హమాలీ, భవన నిర్మాణ కార్మికుల హక్కుల సాధనకు పోరాడాలని అన్నారు. సింగరేణి, ఆర్‌టిసి, జెన్ కో, రైల్వే, విద్యుత్ శాఖ, బ్యాంకింగ్, విమానయానం, రక్షణ విభాగం ఎల్ఐసి, వంటి తదితర ప్రభుత్వ రంగ సంస్థలను కార్పోరేట్ శక్తులకు అప్పనంగా మోడీ ప్రభుత్వం అప్పచెబుతున్నదని ఆరోపించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి దుడ్డు గంగాధర్, తెలంగాణ బీడీ జిల్లా కార్యదర్శి అల్తాఫ్ ,నాయకులు లక్ష్మణ్ గౌడ్, ,ఆదర్శ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు మారుతి, అనిల్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల, కళాశాలలో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టుల భర్తీ కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు నేరుగా నేడు ఉదయం 10.30లకు డెమోకి హాజరుకావాలని ప్రిన్సిపాల్ తెలిపారు. ఆదర్శ పాఠశాల, కళాశాలలో ఖాళీగా ఉన్న టీజీటీ హిందీ - 1, పీజీటీ కెమిస్ట్రీ-1, పిజీటి బోటనీ-1, పిజీటి ఇంగ్లీష్-1 టీచర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు వెల్లడించారు. టిజీటి హిందీ పోస్టు కోసం ఎంఏ హిందీ బి.ఎడ్ చేసిన వారు అర్హులని, పిజీటి కెమిస్ట్రీ, బోటనీ, ఇంగ్లీష్ పోస్టులకు పీజీలో 50శాతం, బిఎడ్ తప్పనిసరి కలిగి ఉండాలని పేర్కొన్నారు. అలాగే ఆదర్శ పాఠశాలలో ఖాళీగా ఉన్న 6,7 తరగతులు, ఇంటర్మీడియట్ కోర్సులో ఖాళీగా ఉన్న సీట్ల కోసం స్పాట్ అడ్మిషన్స్ జరుగుతున్నాయని ఆసక్తి గల విద్యార్థులు ఆదర్శ పాఠశాల బాల్కొండలో నేడు సంబధిత ధ్రువపత్రాలతో స్కూల్‌లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ శంకర్ తెలిపారు.

జర్నలిస్టు అశోక్‌కు నివాళి

నవతెలంగాణ-ఆర్మూర్



పట్టణంలో ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో సీనియర్ జర్నలిస్ట్ అశోక్ చిత్రపటానికి బుధవారం పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భం గా సీనియర్ జర్నలిస్టు లో మాట్లాడుతూ.. అశోక్ 30 ఏళ్లుగా జర్నలిస్ట్ వృత్తిలో కొనసాగారని చెప్పారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఒక నిమిషం పాటు మౌనం పాటించారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

ప్రజలకు నిత్యం సేవచేసే వ్యక్తి రాహుల్ గాంధీ

- జన్మదిన వేడుకల్లో ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ అలీ షబ్బీర్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి
- ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు
- కేక్ కట్‌చేసిన నాయకులు

నవతెలంగాణ-విలేకరులు

ఏఐసీసీ అధినేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకల సందర్భంగా జిల్లాకేంద్రంతోపాటు మండలకేంద్రాల్లో బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్‌కట్‌చేసి పండ్లు పంపిణీ చేశారు.

నిజామాబాద్ సిటీ: కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు ఎంపీ రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ అలీ షబ్బీర్ హాజరయ్యారు. మాట్లాడారు. రాహుల్ గాంధీ గారికి ఎల్లప్పుడు ప్రజలకు సేవ చేయాలనే ఆలోచన ఉంటుందని, మానవత్వం కలిగిన వ్యక్తి రాహుల్ గాంధీ అని అన్నారు. కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు భారతదేశం మొత్తం పాదయాత్ర చేసి ప్రజల కష్టాలను తెలుసుకున్న వ్యక్తి రాహుల్ గాంధీ అని అన్నారు. గ్రామ గ్రామాన ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీ నాయకులు గానీ కార్యకర్తలు గాని పేద పిల్లలకు విద్యకు ఉపయోగపడే విధంగా స్కూల్, డ్రెస్సులు, పుస్తకాలు గాని పంపిణీ చేయాలని రాహుల్ గాంధీ గారు సందేశం పంపారని, కావున ప్రతి ఒక్కరు పాటించాలని షబ్బీర్ అలీ తెలిపారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో ఇండియా కూటమి దేశంలో అత్యధికంగా పుంజుకుందని, 400 పైగా సీట్లను గెలిచి ఇష్టానుసారంగా రాజ్యాంగాన్ని మార్చాలని చూసిన బిజెపి 300 కూడా రాకుండా చేసిన వ్యక్తి రాహుల్ గాంధీ అని తెలిపారు. కార్యక్రమంలో తాహెర్ బిన్ హందం, గడుగు గంగాధర్, ఆకుల లలిత, కేశ వేణు, డిసిసిబి చైర్మన్ రమేష్ రెడ్డి, రత్నాకర్, జావేద్ అక్రమ్, డిల్లి భక్తవత్సలం, నయీం ఫర్హాన్, రాం భూపాల్, సంతోష్, రాజ నరేందర్, విపుల్ గౌడ్, రేవతి, చంద్ర కళ పాల్గొన్నారు.



మానాల మోహన్‌రెడ్డికి కేక్‌ను తినిపిస్తున్న షబ్బీర్ అలీ

ఎడపల్లి: రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మండలకేంద్రంలో కేక్ కట్ చేశారు. అంగన్వాడీ పాఠశాల బాల, బాలికలకు, పాఠశాల విద్యార్థులకు, వృద్ధులకు అరటిపండ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తాజా మాజీ ఉప సర్పంచ్ కుంట శ్రీనివాస్ మాట్లాడారు. దేశంలోనే కాకుండా తెలుగు రాష్ట్రాలలో కాంగ్రెస్‌పార్టీకి పూర్వ వైభవం తెచ్చిన ఘనత రాహుల్ గాంధీకి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలకు, నాయకులు, కార్యకర్తలు దక్కిందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మరింత పుంజుకుంటుందని ఆయన ఆశ భావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రంజిత్‌గౌడ్, చేపూర్ శ్రీనివాస్‌గౌడ్, సందుల సాయికుమార్, కంచరీ గంగాధర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రంలో మండల యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఐరండ్ల నవీన్, యూత్ అధ్యక్షుడు షేక్ పరాన్ పాల్గొన్నారు.



కమ్మర్‌పల్లిలో..



ఆర్మూర్‌లో..

బాల్కొండ : కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, మైనారిటీ మండల అధ్యక్షుడు షేక్ జావిద్ అలీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సయ్యద్ యూనుస్, కుందారపు శ్రీనివాస్, శ్రీనివాస్ గౌడ్, అన్వర్, విక్కీ, ఉషన్న, తమ్మి కపిల్ కుమార్, చైనీ నాగేష్, తౌట్ గంగాధర్, పురుషోత్తం పాల్గొన్నారు.

ఆర్మూర్ : రాహుల్ గాంధీ జన్మదిన సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి వద్ద కాంగ్రెస్ నాయకులు బుధవారం పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జి ప్రొద్దుటూరి వినయ్ కుమార్‌రెడ్డి హాజరయ్యారు. భారత్ జోడో యాత్రతో రాహుల్ గాంధీ అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మున్న, కౌన్సిలర్లు ఆకుల రాము, రవి గౌడ్ పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి : కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకేట రవి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పిరెడ్డి శ్రీనివాస్, కార్యదర్శి తక్కురి దేవేందర్, నాయకులు పాల్గొన్నారు.



డిచ్‌పల్లి : ఎంఎల్‌ఏకు కేక్ తినిపిస్తున్న నాయకులు

డిచ్‌పల్లి : ఇందల్‌వాయి మండల కేంద్రంలోని టోల్ ప్లాజా వద్ద ఏఐసిసి మాజీ అధ్యక్షులు, ఎంపి రాహుల్ గాంధీ జన్మదిన సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షులు మోత్కురి నవీన్‌గౌడ్, నాయకుల అద్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో రాహుల్ గాంధీని దేశ ప్రధాన మంత్రిగా చూడాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు చిన్‌రెడ్డి సంతోష్‌రెడ్డి, డిసిసి డెలిగేట్ నోముల వెంకటొరెడ్డి, మండల ట్రేజరర్ కుంట గంగారెడ్డి, బోర్వెల్ రాజేందర్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి చింతల కిషన్, సహకార సొసైటీ చైర్మన్ చింతల పల్లి గోవర్ధన్‌రెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



బాల్కొండలో..

జక్రాన్‌పల్లి : భారత దేశాన్ని ప్రగతి భవిష్యత్తు వైపు నడిపించగలిగే ఏకైక వ్యక్తి రాహుల్ గాంధీ అని మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వినోద్ అన్నారు. మండలకేంద్రంలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకల సందర్భంగా కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో జక్రాన్ పల్లి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సొప్పరి వినోద్, మాజీ సర్పంచ్ కాటిపల్లి నర్సిరెడ్డి ,ఎంపిటిసి 1 గడ్డం గంగారెడ్డి, గడ్డం సురేష్, జైడి మల్లేష్, రాజు ,మండల యూత్ కాంగ్రెస్ సెక్రెటరీ అరికెలా అభిలాష్ ,మండల యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ కేశ్పల్లి ప్రణయ్, జిల్లా సెక్రెటరీ గన్న లక్ష్మణ్, డిష్ రాజు, దాసు, మైనార్టీ మండల అధ్యక్షులు సైకిల్ టెక్స్ అక్బర్, సొప్పరి సుధీర్, ప్రశాంత్ ప్రేమ్ కుమార్, జనార్ధన్, రంజిత్, మరియు సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

ముప్కాల్: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ జన్మదినం సందరభంగా మండల నాయకులు కేక్ కట్ చేసి ఒకరినొకరు తినుపించుకుంటు సంబరాల్లో మునిగిపోయారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మగ్గిడి ముత్యం రెడ్డి, జిల్లా నాయకులు చిన్నారెడ్డి, ముస్కు మోహన్, కొమ్ముల శ్రీనివాస్, ఏలేటి విజయ్, మల్లారెడ్డి, జక్క రాజేశ్వర్, జైడి రవి, ముస్కు ముత్తెన్న, రాజ్ కుమార్, బద్దం సాగర్ రెడ్డి, లోక సుభాష్, ప్రశాంత్, పోల ప్రవీణ్, సాజిత్, అబ్రార్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం మేరకు మొక్కలు సిద్ధం చేయాలి



నర్సరీని పరిశీలించి మాట్లాడుతున్న ఎంపీడీవో

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

నర్సరీల్లో నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలను సిద్ధం చేయాలని ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆయన మండలంలోని కొన సముందర్ గ్రామంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలు కురిస్తే మొక్కలు నాటేందుకు అనువుగా నిర్దేశించిన లక్ష్యం మేరకు నర్సరీలో లక్షా నలభై వేల మొక్కలను సిద్ధం చేయాలన్నారు. గతంలో హరితహారంలో నాటిన మొక్కలు చనిపోయిన, ఎండిపోయిన వాటి ప్రదేశంలో కొత్త మొక్కలను నాటించాలని ఈజీఎస్ సిబ్బందికి సూచించారు. నాటిన మొక్కల్లో 60 శాతం పైగా మొక్కలు బతికేలా తగిన చర్యలు చేపట్టాలన్నారు. నర్సరీ నిర్వహణ పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సదానంద్, పంచాయతీ కార్యదర్శి నవీన్, తదితరులు ఉన్నారు.

సమావేశాన్ని విజయవంతం చేయాలి

- వికలాంగుల హక్కుల జాతీయ వేదిక



మాట్లాడుతున్న గైనిరాములు

నవతెలంగాణ - బోధన్

బోధన్ పట్టణంలో గురువారం ఉర్దూఘర్ లో నిర్వహిస్తున్న వికలాంగుల జాతీయ వేదిక జిల్లా ముఖ్య నాయకుల సమావేశాన్ని వికలాంగులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఎన్‌పీఆర్‌డీ బోధన్ మండల అధ్యక్షులు గైని రాములు అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయి ముఖ్య నాయకులు సమావేశానికి ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్షులు వెంకట్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య హాజరవుతున్నారని తెలిపారు. ఈ జిల్లా ముఖ్య నాయకుల సమయంలో వికలాంగుల సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి భవిష్యత్ కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని తెలిపారు. మండలంలోని వికలాంగులు అధిక సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో నాయకులు నజీర్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనంపై నుంచి పడి భార్యాభర్తలు మృతి

నవతెలంగాణ-కోటగిరి



దంపతులు (ఫైల్)

బైక్ అదుపుతప్పి పడిన ఘటనలో భార్యభర్తలు మృతిచెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై సందీప్ వివరాల ప్రకారం.. మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన పుప్పుల సాయిబాబా(55) పుప్పుల పోచవ్వ(50) భార్యాభర్తలు. వీరు బుధవారం ద్విచక్ర వాహనంపై మండలకేంద్రానికి క్రమంలో ఎక్లాస్‌పూర్ క్యాంప్ గ్రామంలో రామాలయం సమీపాన బైక్ అదుపుతప్పి అక్కడికక్కడే మృతి చెందారు. ఎస్ఐ అక్కడికి చేరుకుని మృతదేహాలను పంచనామా నిమిత్తం బోధన్ ఆసుపత్రికి తరలించారు. వారికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పిల్లలకు వివాహాలు చేశారు. ఇద్దరు కూలీపనులు చేసుకుంటున్నారు. ఇద్దరి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ద్విచక్ర వాహనాలు స్వాధీనం



పట్టుకున్న ద్విచక్ర వాహనాలు

నవతెలంగాణ-కోటగిరి

వాహనదారుల వద్ద పత్రాలు లేకపోవడంతో బోధన్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, పోలీసులు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మండలకేంద్రంలో వారాంతపు సంత సందర్భంగా వివిధ గ్రామాల నుండి పనుల నిమిత్తం ద్విచక్ర వాహనాలపై వచ్చారు. వాహనాలను తనిఖీచేసిన సరైన పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు. వాహనాలకు ఫైన్ వేయమని ప్రాధేయబడినప్పటికీ ఎవరికి ద్విచక్ర వాహనాలు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-బోధన్

కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు, ఎంపీ రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను బుధవారం బోధన్, సాలూర మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో సాలూరా మండల్ అధ్యక్షుడు మందర్న రవి ,సీనియర్ నాయకుడు అల్లే రమేష్, సొసైటీ చైర్మన్ జనార్ధన్, శ్రీనివాస్ రెడ్డి,రమేష్ ,సాయిలు, ఎక్స్ ఎంపిటిసి శంకర్, ఎన్ ఎస్ యు అధ్యక్షుడు అనిల్, రాహుల్ లక్ష్మణ్, దేవదానం, ఫతేపూర్ గౌస్ , సాలూరు గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు నాయకులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ సర్వే పూర్తి చేయాలి

- ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని అన్ని గ్రామాల్లో మిషన్ భగీరథ త్రాగునీటి సర్వేను గురువారంలోపు పూర్తి చేయాలని ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని బషీరాబాద్ గ్రామంలో కొనసాగుతున్న మిషన్ భగీరథ తాగునీటి ఇంటింటి సర్వేను ఆయన పరిశీలించారు. మండలంలో సుమారు 80 శాతం మిషన్ భగీరథ తాగునీటి సర్వే పూర్తయిందని, గురువారం సాయంత్రం వరకు 100శాతం సర్వే పూర్తి చేయాలని సర్వే చేస్తున్న సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా పలువురి లబ్దిదారుల ఇండ్లను సందర్శించిన ఆయన వారితో మాట్లాడారు. మిషన్ భగీరథ తాగునీటి నల్ల నీరు వస్తుందా.. ప్రతిరోజు ఎన్నిసార్లు వస్తుంది, ఎంత సమయం వస్తుందని అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ తాగునీటిని వృధా చేయొద్దని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం వర్షాకాలం సీజన్ ఆరంభమైందున ఎప్పటికప్పుడు మురికి కాలువలను శుభ్రం చేయించాలని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌కు సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా శానిటేషన్ మంచిగా చేయించాలన్నారు. ఇంటి పన్నుల వసూళ్లపై ప్రత్యేకంగా దృష్టి పెట్టి పన్నుల వసూళ్లను పెంచాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

ఆర్టీసీ ప్రయాణికుని హ్యాండ్ బ్యాగ్ అందజేత

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



హ్యాండ్‌బ్యాగ్, నగదు అందజేస్తున్న కండక్టర్

వరంగల్ నుండి నిజామాబాద్ వస్తున్న బస్‌లో ప్రయాణికురాలు పోగొట్టుకున్న నగదు ఉన్న హ్యాండ్‌బ్యాగ్ ఆమెకు అందజేశారు. బుధవారం ఓప్రయాణికు రాలు వరంగల్ నుండి కోరుట్ల ప్రయాణించే సమయంలో హాండ్ బ్యాగ్‌ను మరిచిపోయింది. ఆ హ్యాండ్ బ్యాగ్‌లో 3600 రూపాయలు ఉన్నాయి. నిజామాబాద్ ఆర్టిసి రెండవ డిపో మేనేజర్ సాయన్న, కండక్టర్ బి.రాంరాజు హ్యాండ్‌బ్యాగు, నగదును ప్రయాణికురాలి సంబంధీకులకు డిపోలో మేనేజర్ ముందు అందజేశారు.. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులు సమయపాలనతో ఆర్టీసీ బస్సు నడపడమే కాకుండా ప్రయాణికుల యోగక్షేమాల కోసం, నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. అందులో భాగంగానే పోగొట్టుకున్న హ్యాండ్ బ్యాగ్ ని ప్రయాణికులకు ఆర్టీసీ ఉద్యోగులు అందజేస్తారని అన్నారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ కండక్టర్ రాంరాజుని ప్రశంసించి అభినందనలు తెలిపారు.

30 మంది విద్యార్థుల చేరిక

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని తొర్లికొండ ప్రాథమిక పాఠశాలలో 30 మంది విద్యార్థులు తొర్లికొండ కాంప్లెక్స్ హై స్కూల్ నందు బుధవారం చేర్పించినట్టు ప్రధానోపాధ్యాయులు జంగం అశోక్ తెలిపారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఇన్చార్జి ఎంఈఓ శ్రీనివాస్‌కు విద్యార్థుల రికార్డ్ సీట్లను అందజేసినట్లు అశోక్ పేర్కొన్నారు.

కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- ఐఎఫ్టియు నాయకులు దాసు
- 24న కలెక్టరేట్ వద్ద ధర్నా జయప్రదం చేయండి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దాసు, కార్మికులు

కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఐఎఫ్టియు నాయకులు దాసు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాల ఆవరణలో కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దాసు మాట్లాడుతూ.. ఈ నెల 24న నిజామాబాద్ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి, వినతి పత్రాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలో కెసిఆర్ ప్రభుత్వం, కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబించినాయని ఆయన అన్నారు. పంచాయతీ, బీడీ, కేజీబీవీ, బిటిసి, హమాలి, మోటారు రంగ కార్మికుల సమస్యలను నిర్లక్ష్యం చేసిందని తెలిపారు. గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె శిబిరాల వద్దకు వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టగానే పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చారని అన్నారు. కాలయాపన చేయకుండా సఫాయి కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని దాసు కోరారు. బీడీ కార్మికులందరికీ ఆంక్షలు లేకుండా జీవన భృతి ఇవ్వాలన్నారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యల్ని పరిష్కరించాలని తెలిపారు. కేసీఆర్ డబుల్ బెడ్ రూమ్ పథకం పేద ప్రజలకు అందని ద్రాక్ష పండులా తయారు చేశారని ఆయన తెలిపారు. అర్హులైన పేదలందరికీ స్థలాలు ఇచ్చి, ఇండ్లను నిర్మించి ఇవ్వాలని దాసు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో వివిధ కార్మికులకు ఇచ్చిన జీవోలను గెజిట్ ఎక్కించాలని ఆయన కోరారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను అమలు చేయడం సాధ్యం కాదని తెలంగాణ రాష్ట్ర శాసనసభలో తీర్మానం చేసి, కార్మికుల ఉపాధి కాపాడాలని, కేంద్ర ప్రభుత్వాన్ని కోరాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వివిధ రంగాల కార్మికులు, పాల్గొనాలని దాసు పిలుపునిచ్చారు. సమావేశంలో తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు (ఐఎఫ్టియు) సొప్పరి గంగాధర్, శేఖర్, రాజన్న, సాయిలు, సర్వర్ లక్ష్మి, రేణుక, భూదేవి, స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

మాజీ స్పీకర్‌ను కాంగ్రెస్‌లోకి రానివ్వం

- కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-పోతంగల్



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

పోతంగల్ మండలంలోని చెక్ పోస్ట్ వద్ద మాజీ జెడ్‌పిటీసి పుప్పాల శంకర్ ఆధ్వర్యంలో బుధవారం ప్రెస్ మీట్ నిర్వహించి మాట్లాడారు. బాన్సువాడ నియోజకవర్గం శాసనసభ సభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డి 1983లో కాంగ్రెస్‌లో ఉండి పదవులు అనుభవించారన్నారు. తర్వాత టిడిపిలో చేరి పదవులు, అధికారం అనుభవించి, 2011లో తెలంగాణ ఉద్యమ సమయంలో టిఆర్ఎస్ పార్టీలో చేరి పదవులు అధికారం అనుభవించారని తెలిపారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో అధికారం పదవి లేకపోయే సరికి అల్లాడిపోతున్న ఎంఎల్ఏ పోచారం శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ పార్టీ లోకి రావడానికి చూస్తున్నారన్నారు. ఆయన్ను రానిచ్చేదిలేదని మండలంలోని అన్ని గ్రామాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు కార్యదర్శులు, కార్యకర్తలు తెలిపారు. సమావేశంలో మాజీ ఎం.పి. పి. గంధపు పవన్, రామ్ రెడ్డి, డిసిసి డెలిగేట్ హన్మంతు, మాజీ ఎంపిటి సి హన్మంతు రావు, పిటిసి కేశ వీరేశం, పోతంగల్ గ్రామ అధ్యక్షులు పుల్కంటి సాయిలు, మండల యూత్ అధ్యక్షుడు మన్సూర్, అన్ని గ్రామాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు..